ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
బుధవారం 2 ఏప్రిల్ 2025


కృష్ణానదిపై నిర్మించనున్న ఐకానిక్ వంతెన (పాత చిత్రం)

ఐకానిక్ మారిస్తే.. సమస్యే

- మరింత వ్యయం.. గందరగోళం
- కృష్ణానదిపై పక్కపక్కగానే వంతెనలు
- భవిష్యత్‌లో అమరావతి ఐఆర్‌ఆర్‌కు ఇబ్బందే
- ఏడీసీఎల్ నిర్ణయాన్ని పరిశీలించాలని పలువురి సూచన

కృష్ణానదిపై అమరావతి ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణస్థలిని మార్చడం కొంత గందరగోళానికి దారితీస్తోంది. ఈ బ్రిడ్జిని రాయపూడి-ఫెర్రీ మధ్య కాకుండా ఎగువన రాయపూడి-మూలపాడు మధ్య నిర్మించాలన్న సరికొత్త ఏడీసీఎల్ తీసుకుంది. ఈ ప్రతిపాదనతో నిర్మాణ వ్యయం పెరగ డంతో పాటు జగదల్పూర్ హైవేతో అమరావతికి డైరెక్ట్ కనెక్టివిటి తప్పినట్లవుతుంది. పైగా ఎగువ ప్రాంతంలో దీనిని నిర్మించడం వల్ల భవిష్యత్‌లో అమరావతి అంతర వలయ రహదారికి ఒకింత ఇబ్బందులు తలెత్తే ప్రమాదం పొంచి ఉంది. ఐకానిక్ బ్రిడ్జి ఎన్టీఆర్ జిల్లా వైపు మూలపాడు నుంచి ప్రారంభమైతే ఐఆర్‌ఆర్ తాలూకు కృష్ణానదిపై నిర్మించాల్సిన కొత్త బ్రిడ్జి దానికి అతి చేరువలోనే కోటికలపూడి ప్రాంతంలో ఏర్పాటవుతోంది. ఈ రెండు బ్రిడ్జిలు పక్కపక్కనే వస్తే నష్టమేమి ఉండకపోవచ్చునేమోగానీ లాభం మాత్రం ఉండదు. అదే గతంలో ప్రతిపాదించినట్లుగా రాయపూడి-ఫెర్రీల మధ్య నిర్మిస్తే నిర్మాణ వ్యయం తగ్గడంతోపాటు జగదల్పూర్ హైవేతో అమరావతి నేరుగా సంధానించబడుతోంది.





కృష్ణ దిగువన రెండు వంతెనలు

ఇక ప్రకాశం బ్యారేజికి దిగువన ఓఆర్‌ఆర్ తాలూకు కృష్ణానదిపై ఓ వంతెన రావడంతో పాటు ఐఆర్‌ఆర్ నిర్మాణం జరిగితే ఇటు గుంటూరు జిల్లా చిర్రావూరు అటు కృష్ణాజిల్లా చోడవరం మధ్య మరో కొత్త వంతెన వచ్చినట్టవుతోంది. అంటే వైకుంఠపురం బ్యారేజి కమ్ బ్రిడ్జి, ఐఆర్‌ఆర్ నిర్మాణాలు జరిగితే కృష్ణానదిపై కొత్తగా మొత్తం ఆరు కొత్త వంతెనలు వాహనదారులకు అందుబాటులోకి వచ్చినట్టవుతుంది.

అమరావతికి గ్రాండ్ ఎంట్రీ

అమరావతికి మరింత గ్రాండ్ ఎంట్రీ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం రాయపూడి వద్ద ఎన్-13 రోడ్డును ఎన్టీఆర్ జిల్లా మూలపాడు వద్ద కలుపుతూ కృష్ణానదిపై 5.2 కిలోమీటర్ల పొడవునా ఐకానిక్ బ్రిడ్జిని నిర్మించాలని ఏడీసీఎల్ ప్రతిపాదించింది. ఈ ఐకానిక్ బ్రిడ్జి ఆరంభంలో మూలపాడు వద్ద ఓ భారీ స్వాగత ద్వారాన్ని అత్యంత ఆకర్షణీయంగా ఏర్పాటు చేయాలని కూడా ఏడీసీఎల్ నిర్ణయించింది. దీనికి సంబంధించి కూడా డీపీఆర్ తయారీ కి కన్సల్టెంట్‌లను ఆహ్వానిస్తుంది.

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జి మళ్ళీ తెరమీదకు వచ్చింది. 2019 జనవరిలో రూ.1327 కోట్లతో దీనిని గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం రాయపూడి-ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఫెర్రీ పవిత్రసంగమం మధ్య కృష్ణానదిపై నిర్మించేందుకు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ సిద్ధమైంది. ఆ మేరకు అప్పట్లో సీఎం చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేసి పైలాన్‌ను కూడా ఆవిష్కరించారు. ఎల్‌అండ్‌టీ సంస్థ పనులను చేపట్టింది. ఆ తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ ఈ ప్రాజెక్టును మూలన పడేసింది. గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అమరావతి నగర నిర్మాణ పనులకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఈ క్రమంలో గతంలో నిలిచిపోయిన ఐకానిక్ బ్రిడ్జి, వైకుంఠపురం బ్రిడ్జి, సీడ్ యాక్సిస్ రెండో దశ పనులపై దృష్టి సారించింది. అయితే ఐకానిక్ బ్రిడ్జిని గతంలో నిర్మించాలనుకున్న ప్రదేశం నుంచి మార్చాలనుకోవడం (మిగతా 8వ పేజీలో)

త్వరలో గుంటూరు ఛానల్ పనులు

- కొమ్మమూరు కాల్వ ఆధునికీకరణకు రూ.5 కోట్లు
- బాపట్ల జిల్లా కొత్తగొల్లపాలెంలో పింఛన్ల పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు నాయుడు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గుంటూరు ఛానల్ ఆధునికీకరణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. సామాజిక పింఛన్ల పంపిణీ కోసం మంగళవారం చినగంజాం మండల పరిధిలోని కొత్తగొల్లపాలేనికి సీఎం వచ్చారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్లను అందజేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదికలో సీఎం పాల్గొని ప్రసంగించారు. పెండింగ్ ఉన్న నాగార్జున సాగర్ కాల్వల మరమ్మతులతో పాటు కాల్వల ఆధునికీకరణకు నిధుల ను త్వరలోనే మంజూరు చేస్తామన్నారు. కృష్ణా పశ్చిమ డెల్టా పరిధి లోని కొమ్మమూరు కాల్వల ఆధునికీకరణకు రూ.5 కోట్లు అదనంగా విడుదల చేస్తున్నట్లు సీఎం తెలిపారు. తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి రూ.14 కోట్లు విడుదలకు అనుమతిచ్చారు. బాపట్ల జిల్లా పరిధిలోని మోటుపల్లి తీరంలో ప్రతిపాదనల దశలో ఉన్న నౌక నిర్మాణ పరిశ్రమ ను సాధనకు హామీ ఇచ్చారు. రెండేళ్లలోనే గ్రామం రూపురేఖలను మార్చుతామన్నారు. ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్ది రాష్ట్రానికే నమూనా చేస్తామన్నారు.

పనితీరు ఆధారంగా రేటింగ్

తనతో సహా అందరి పనితీరుపై ఎప్పటికప్పుడు సమీక్ష జరిపి పనితీరు ఆధారంగా రేటింగ్ ఇస్తామని చంద్రబాబు తెలిపారు. పార్టీ క్యాడర్ సమావేశంలో సీఎం మాట్లాడుతూ పనితీరు పేలవంగా ఉన్న ఎవరైనా సరే తీరు మార్చుకోవాల్సిందేనని చెప్పారు. ప్రస్తుతం ఉన్న నివేదికలను పరిశీలిస్తే ఎమ్మెల్యేలు, నేతల పనితీరు ఇంకా మెరుగుపడాల్సి ఉందన్నారు. కార్యకర్తలు జెండా మోసి పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చారని, వారి సంక్షేమం కోసం పార్టీ కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు రవికుమార్, సత్యప్రసాద్, బాలవీరాంజనేయస్వామి, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మె ల్యేలు ఏలూరి సాంబశివరావు, నరేంద్రవర్మ, కొండయ్య ఆనంద్‌బాబు పాల్గొన్నారు.


అవ్వ మాటలను వింటూ..

సబ్సిడీ యంత్రాల్లో కమీషన్ల మోత

కొటేషన్లతో.. కొట్టేశారు





- కొండెక్కిన వ్యవసాయ యంత్రాల ధరలు
- గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు రూ.8.56 కోట్లు
- సబ్సిడీ నిధుల్లో అధికారుల జేబుల్లోకి 12 శాతం?
- స్ప్రేయర్ ధర రూ.21 వేలు.. రూ.27 వేలకు బిల్లు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా ఏకమొత్తంగా ఏదైనా వస్తువులు కొనుగోలు చేస్తే వాటి ధర తగ్గుతుంది. ఇక తయారీ సంస్థలనే నేరుగా సంప్రదిస్తే మరింతగా ధర తగ్గుతుంది. అదే ప్రభుత్వం అనుకుంటే ఇంకా తగ్గాలి. కానీ అదేమిటో కానీ విచిత్రంగా బహిరంగ మార్కెట్లోని ధర కంటే పెరిగిపోతోంది. అధికారుల కమీషన్ల మాయతో ధరలను పెంచేసి లబ్ధిదారులపై భారం మోపుతున్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేస్తున్న సబ్సిడీ యంత్రాల పరిస్థితి ఇలాగా ఉంది. రైతు నేరుగా వెళ్లి కొనుగోలు చేస్తే అదే యంత్రం తక్కువ ధరకు వస్తుంది. అదే వ్యవసాయ శాఖ సబ్సిడీ ద్వారా అంటే రేటు కొండెక్కుతోంది. ఉదాహరణకు తైవాన్ పవర్ స్ప్రేయర్లు మార్కెట్‌లో రూ.21 వేల నుంచి రూ.22 వేల వరకు దొరుకుతున్నాయి. వాటి ధరను వ్యవసాయ శాఖ రూ.27 వేల వరకు నిర్ణయించింది. మండల స్థాయి నుంచి కమిషనరేట్ వరకు కమీషన్లు కలుపుకోవడంతో ఒక్కో యంత్రం ధర రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు పెరిగింది. 50 శాతం సబ్సిడీ పేరుతో అధికారులు జేబులకు చిల్లు పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రూ.8.56 కోట్లు మంజూరు చేసింది. గుంటూరు జిల్లాకు మొత్తం 1727 వ్యవసాయ యంత్రాలు మంజూరు చేయగా, సబ్సిడీ నిమిత్తం రూ.2.91 కోట్లను కేటాయించింది. పల్నాడు జిల్లాలో 1715 వ్యవసాయ యంత్రాలు మంజూరు చేయగా సబ్సిడీ నిమిత్తం రూ.2.80 కోట్లు కేటాయించారు. బాపట్ల జిల్లాలో 1719 వ్యవసాయ యంత్రాలు మంజూరు చేయగా, రూ.2.85 కోట్లు సబ్సిడీగా కేటాయించారు.

జీఎస్టీ పేరు చెప్పి..

సబ్సిడీ యంత్రాల ధరలు పెరగడానికి అధికారులు కొత్త భాష్యం చెబుతున్నారు. జీఎస్టీ కారణంగానే ధరల్లో తేడా ఉన్నట్లు పేర్కొంటున్నారు. ఏపీ ఆగ్రోస్‌కి రెండు శాతం చెల్లించాల్సి వస్తుందంటున్నారు. అయితే అధికారులు చెబుతున్న కారణాలను రైతులు పట్టించుకునే పరిస్థితిలో లేరు. సబ్సిడీ పేరుతో అధికారులు అవినీతితో తమను దోచుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

మార్కెట్లో తక్కువ ధర..

ప్రభుత్వం రైతులకు అండగా ఉండేందుకు సబ్సిడీపై ఏవైతే యంత్రాలు ఇస్తామని చెబు తుందో ఆయా యంత్రాలు బహిరంగ మార్కె ట్‌లో చాలా తక్కువ ధరకు వస్తున్నాయి. ఉదాహరణకు రోటావేటర్ మార్కెట్ ధర రూ.1.15 లక్షల వరకు ఉండగా, సబ్సి డీ ధర రూ.1.45 లక్షలుగా నిర్ణయించారు. మిగిలిన యంత్రాలు విలువ కూడా మార్కెట్‌లో చాలా తక్కువగా ఉన్నా సబ్సిడీ పేరు చెబితే ఎక్కువ చెబుతున్నారు. సబ్సిడీ యంత్రాలు సరఫరా చేసేందుకు అధికారులు రాష్ట్ర స్థాయిలో కొటేషన్లు ఆహ్వానించగా ఆ సమయంలోనే కమీషన్లు నిర్ణయం జరిగిందని సమాచారం. దీంతో యంత్రాలకు అసలు ధరకు మించి కొటేషన్లు ఇవ్వాలని ముందుగానే అధికారులు వ్యాపారులకు సూచించినట్లు తెలుస్తుంది. అసలు ధర కన్నా కనీసం 12 శాతం ఎక్కువగా కొటేషన్లు ఉండాలని నిర్ణయించారు. దానికి అనుగుణంగా కొటేషన్లు ఇచ్చిన వారికి మాత్రమే యంత్రాల సరఫరాకు అవకాశం దక్కినట్లు తెలుస్తుంది. వ్యవసాయ యంత్రాల కొనుగోలులో మిగులు సొమ్మును ఎవరికి ఎంత పంపాలన్న దానిపై కూడా పూర్తిగా ఒప్పందం జరిగినట్లు సమాచారం. కింద స్థాయిలోని అధికారుల నుంచి వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లో ఉన్న కొందరు అధికారులకు చేరేలా ప్రణాళికలను రూపొందించారు.

పండుగలా పట్టాల పంపిణీ

- నాలుగు నుంచి పంపిణీకి లోకేశ్ శ్రీకారం
- తొలి విడతలో మూడు వేలమందికిపైగా పేదలకు
- ఎర్రబాలెం డాన్‌బోస్కో వద్ద సభా భారీగా ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

నేను గెలిస్తే.. పోరంబోకు భూముల్లో స్థిర నివాసం ఉంటున్న వారందరికీ ఉన్నచోటునే క్రమబద్ధీకరిస్తా. వారికి నివేశన పట్టాలు ఇస్తా.. అని 2024 ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. ఆ హామీని నిలబెట్టుకుంటూ నివేశన పట్టాల పంపిణీకి మంత్రి లోకేశ్ శ్రీకారం చుట్టారు. నియోజకవర్గ పరిధిలో అటవీ, రైల్వే భూముల్లో ఉంటున్న వారికి నివేశన పట్టాలను పంపిణీకి రంగం సిద్ధమైంది. పట్టాల పంపిణీని ఓ పండుగలా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. లబ్ధిదారులకు పట్టాలతో పాటు నూతన వస్త్రాలను కూడా లోకేశ్ అందించనున్నారు. 4న పట్టాల పంపిణీకి మంగళగిరి డాన్‌బోస్కో ఉన్నత పాఠశాల గ్రౌండును వేదికగా నిర్ణయించారు. ఇక్కడ ఏర్పాట్లను మంగళగిరి మార్కెట్ యార్డు చైర్మన్, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలివిడతగా మూడు వేలనుంచి నాలుగు వేల మందికి పట్టాలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

మన ఇల్లు- మన లోకేశ్


పేదలకు పట్టాల పంపిణీ కార్యక్రమానికి మన ఇల్లు-మన లోకేశ్ అనే పేరును నిర్ణయించారు. ఎంతోమంది నాయకులు వచ్చారు.. పోయారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా ప్రతీ నాయకుడు ఇళ్లపట్టాల సమస్యను పరిష్కరిస్తానంటూ హామీ ఇవ్వడంతో సరిపెట్టారు. ఈ పరిస్థితుల్లో వచ్చే ఎన్నికల నుంచి ఏ నాయకుడు ఇక ఇళ్ల పట్టాలపై హామీని ఇవ్వలేని పరిస్థితులను లోకేశ్ సృష్టిస్తున్నారు. మంగళగిరిలో నివేశన పట్టాల సమస్యను ఛాలెంజ్‌గా తీసుకున్న లోకేశ్ దానిని పూర్తిస్థాయిలో పరిష్కరించాలని దీక్ష తీసుకున్నారు. పేదలు ఇబ్బందులు పడకుండా అధికారులే స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి దరఖాస్తులను నింపడం వరకూ అన్ని దశలను లోకేశ్ స్వయంగా పర్యవేక్షించారు. ఈ నెల 3న మొదటి పట్టాను ఉండవల్లి గ్రామంలో లబ్ధిదారుడికి లోకేశ్ స్వయంగా వెళ్లి అందజేయనున్నారు. ఆ తర్వాత 4న డాన్‌బోస్కో ఉన్నత పాఠశాల వద్ద ఉన్న గ్రౌండులో నివేశన పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజున ఎర్రబాలెం, నీరుకొండ, కాజ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేస్తారు. 7న పెనుమాక, ఉండవల్లి, ఇప్పటం, కొలనుకొండ, పద్మశాలీ బజారు ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు పట్టాలను అందజేస్తారు. 8న మంగళగిరి రత్నాలచెరువు, మహానాడు-2కు చెందిన వారికి పట్టాలను పంపిణీ చేస్తారు. 11న సీతానగరం, సలాం సెంటర్, డ్రైవర్స్‌కాలనీకి చెందిన లబ్ధిదారులకు, 12న మహానాడు-1, ఉండవల్లి సెంటర్ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేయనున్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న యార్డు చైర్మన్ -జవ్వాది కిరణ్‌చంద్ తదితరులు

శంకర్‌విలాస్.. ఆర్వోబీకి అడ్డుపడొద్దు

- గుంటూరుకి బ్రిడ్జి విస్తరణ ఎంతో అవసరం
- భవిష్యత్‌లో ఆర్‌యూబీ నిర్మాణానికి వీలుగా డిజైన్
- మీడియా సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): 'శంకర్‌విలాస్ నాలుగు వరసల రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ఎవ్వరూ అడ్డుపడొద్దు. నగరంలో పెరిగిన ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ఇరుకుగా మారిన ఈ ఆర్వోబీని విస్తరించాల్సిన అవసరం వచ్చింది. బ్రిడ్జి డిజైన్‌పై పలుమార్లు సమావేశాలు నిర్వహించి అందరి అభిప్రాయాలు తీసుకున్న తర్వాత కట్టడాలకు తక్కువ నష్టం జరిగేలా చూస్తూ ఆమోదించాం. బ్రిడ్జి నిర్మాణంపై అపోహలను విడనాడాలి.' అని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో మంగళవారం ఎస్పీ సతీష్‌కుమార్, నగరపాలకసంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఆర్ అండ్‌బీ ఎస్‌ఈ శ్రీనివాసమూర్తి, మున్సిపల్, పోలీసు శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1958లో నిర్మించిన ఆర్వోబీ బలహీనపడిందని చెప్పారు. ప్రస్తుత బ్రిడ్జిపై వాహనాల రాకపోకలు పెరిగి ట్రాఫిక్ స్తంభించిపోతున్నదని, ఈ దృష్ట్యా ఇక్కడ నాలుగు వరసల బ్రిడ్జి అవసరమన్నారు. సేతు బంధన్ స్కీమ్ కింద మంజూరైన ఈ బ్రిడ్జికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రూ.98 కోట్లు విడుదల చేయించారన్నారు. అమరావతి రోడ్డు వైపు రీఇన్‌ఫోర్స్ ఎర్త్ వాల్ 215 మీటర్లు, హిందూ కళాశాల వైపున 168 మీటర్లు ఉంటుందన్నారు. 23 మీటర్లకు ఒక సింగిల్ పిల్లర్ చొప్పున రెండు వైపుల 4+4 నిర్మిస్తామన్నారు. ప్రభుత్వ మహిళ కళాశాల జంక్షన్ సమీపంలో బ్రిడ్జి అప్రోచ్ ప్రారంభమై అరండల్‌పేట 9వ లైను వద్ద ల్యాండింగ్ అవుతుందన్నారు. బ్రాడీపేట 4వ లైను, అరండల్‌పేట 5వ లైను, జీజీహెచ్ వద్ద అండర్‌పాస్‌లు నిర్మాణం చేస్తామ న్నారు. ఆర్‌యూబీని నిర్మించి ఆ తర్వాత ఆర్వోబీ నిర్మాణం అన్న వాదన ఈ సమయంలో కరెక్టు కాదన్నారు. దాని వల్ల ఆర్వోబీ నిర్మాణానికి ఆటంకాలు తలెత్తుతాయన్నారు. భవిష్యత్‌లో ట్రాఫిక్ మరింత పెరిగితే అప్పుడు ఆర్‌యూబీ నిర్మించేలా ఫౌండేషన్ నిర్మిస్తామన్నారు. సర్వీసు రోడ్ల వెడల్పు 23 మీటర్లు ఉంటుందని, భారీ వాహనాలు ప్రయాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. హిందూ కళాశాల జంక్షన్ నుంచి లాడ్జి సెంటర్ వరకు బ్రిడ్జి నిర్మిస్తే మరిన్ని కట్టడాలకు నష్టం వాటిల్లుతుందన్నారు. జీజీహెచ్ వద్ద అంబులెన్స్‌ల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అండర్‌పాస్ నిర్మాణం జరుగుతుందన్నారు. 134 కట్టడాలు ప్రభావితమౌతాయని, వాటిల్లో 99ప్రైవేటువి కాగా 42 మంది ఇప్పటికే ఆ మోదం తెలిపారన్నారు. 45 మంది కోర్టుని ఆశ్రయించగా ఐదుగురు కేసుని ఉపసంహరించుకున్నారని చెప్పారు. భూసేకరణ కంటే కార్పొరేషన్ జారీ చేసే టీడీఆర్ బాండ్స్, చెల్లించే నష్టపరిహారం ఉపయోగకరంగా ఉంటుంద న్నారు. ఎస్పీ మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించగానే పాతది కూల్చే సి ట్రాఫిక్‌ని మళ్లించబోమన్నారు. ఆరు నెలలు పాత బ్రిడ్జిపైనే ట్రాఫిక్ కొనసాగుతుందన్నారు. ఆ తర్వాత ట్రాఫిక్‌ని మూడొంతెనలు, కంకరగుంట ఆర్వోబీ, ఆర్‌యూబీ, అమరావతి రోడ్డులోని ఇన్నర్ రింగురోడ్డు నుంచి మళ్లిస్తామన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, కమిషనర్ శ్రీనివాసులు

నగరంలో.. రెండు హత్యలు

- మద్యం మత్తులో అకారణంగా ఒకరు
- వివాహేతర సంబంధంతో యువకుడు..?

గుంటూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం రెండు హత్యలు జరిగాయి. రెడ్డిపాలెం వద్ద ధారావత్ రామునాయక్(57), అరండల్‌పేట ఒకటో లేన్ రైల్‌మహల్ వద్ద పోలేపల్లి గణేష్(39) దారుణ హత్యలకు గురయ్యారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలు.. రెడ్డిపాలేనికి చెందిన బట్టు రాజు మద్యం తాగి ఉన్నాడు. ఆ సమయంలో అటుగా శారదాకాలనీ 25వ లేనుకు చెందిన దారావత్ రామునాయక్ రెడ్డిపాలెం వాటర్ ట్యాంకుల వైపు నుంచి వస్తుండగా చంపేస్తానని రాజు హెచ్చరించగా నీవల్ల కాదులే అన్నాడు. దీంతో రాజు సమీపంలోని బీరు సీసాతో రాము నాయక్‌పై దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు. భార్య గతంలోనే మృతి చెందడంతో కూతురు వద్ద రామునాయక్ ఉంటున్నాడు. కొన్నేళ్లుగా విజయవాడలో తాపీ పని చేసుకునే రాజు మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి మానసిక ఉన్మాదిగా వ్యవహరిస్తుంటాడు. ఈ క్రమంలోనే రామునాయక్‌ను అకారణంగా హత్య చేశాడు. రాజును పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.



హత్యకు గురైన గణేష్, రాము నాయక్

యువకుడి హత్యపై అంతుచిక్కని కారణాలు

అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో కేవీపీకాలనీకి చెందిన పోలేపల్లి గణేష్(39) హత్యకు గురయ్యాడు. అయితే గణేష్ హత్యకు దారి తీసిన కారణాలు అంతుచిక్కడం లేదు. ఫ్లెక్సీలు కడుతూ జీవనం సాగించే గణేష్ మద్యానికి బానిసయ్యాడు. అరండల్‌పేట ఒకటో లేన్‌లో నివాసం ఉండే పోలమ్మ అనే మహిళ ఇంటికి వచ్చి వెళ్తుంటాడు. ఆమె కొడుకు, అల్లుడితో కలిసి తిరిగే గణేష్ వారితో గొడవపడ్డాడు. ఈ క్రమంలో పోలమ్మ కొడుకు, అల్లుడుతోపాటు వారి స్నేహితులు ఇంకొందరు కలిసి గణేష్‌పై దాడి చేసి హత్య చేసి పరారయ్యారు. సమాచారం అందుకున్న అరండల్‌పేట సీఐ వీరాస్వామి సిబ్బంది ఘటనాస్థలిని పరిశీలించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. అయితే గణేష్ హత్యకు వివాహేతర సంబంధం కారణమా లేదంటే వారి మధ్య నెలకొన్న వివాదం కారణమై ఉంటుందా అనేది తెలియరాలేదు. హతుడు గణేష్‌పై నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో సస్పెక్టెడ్ షీటు ఉన్నట్లు తెలిసింది.



సూర్యలంకలో సందడి

- దీక్షల ముగింపుతో తీరానికి పోటెత్తిన ముస్లింలు

8

నరసరావుపేటలో బర్డ్‌ఫ్లూ మరణం!

- రెండేళ్ల చిన్నారి మృతి
- గుంటూరులో హెచ్5ఎన్1 సర్వెలెన్స్ సెంటర్‌కు ఆమోదం

వర్సిటీలో కోర్సుల రద్దుపై ఉద్యమిస్తాం

విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు

పెదకాకాని, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పలు కోర్సులను రద్దుచేస్తున్నట్లు ఈసీ కమిటీ సమావేశంలో తీర్మానించడం అత్యంత బాధాకరమని, దీనిపై పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని పీజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్, రీసెర్చ్ పరిరక్షణ జేఏసీ నాయకులు తెలిపారు. మంగళవారం వర్సిటీలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ



వర్సిటీలో ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు

యూనివర్సిటీ అధికారులు పత్రికాముఖంగా తెలియజేసిన ప్రకటన ద్వారా ఎల్ఎల్ఎంలో కొన్ని కోర్సులను ఈ విద్యా సంవత్సరం నుంచి నిలిపివేస్తున్నట్లు వార్తలను చదివి దిగ్భ్రాంతికి లోనయ్యామన్నారు. దశాబ్దాల చరిత్ర కలిగిన మన విశ్వవిద్యాలయ న్యాయవిభాగం ద్వారా ఎందరో పేద,గ్రామీణ విద్యార్థులు ఇక్కడ న్యాయ శాస్త్రం అభ్యసించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థాయికి చేరుకున్న సంగతి మీకు విధితమేనని, గత కొన్ని రోజులుగా ఒక అధ్యాపకుని కారణంగా కుల వివక్ష నెపంతో వర్సిటీ ప్రతిష్ఠకు భంగం ఏర్పడింది కానీ అతనిపై ఏ చర్య తీసుకోలేని అధికారులు పేద విద్యార్థుల భవిష్యత్తును సమాధి చేయటం ఏమంత సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా కోర్సుల మూసివేత చర్యను మాని న్యాయవిభాగాన్ని బలోపేతం చేసేలాగా తద్వారా పేద, గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు గిరీష్, జీ శ్రీనివాసరావు, మధులత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి జాతీయస్థాయి నాటికల పోటీలు

రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 10 ప్రదర్శనలు ఎంపిక

యడ్లపాడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం 22వ జాతీయస్థాయి నాటికల పోటీలు ఏప్రిల్ 4,5,6 తేదీలలో నిర్వహించనున్నట్లు తెలుగు నాటక పరిషత్‌ల సమ్మేళనం(వేదిక), యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రదర్శనకు ఎంపికైన నాటికల వివరాలను ఆయన మంగళవారం వెల్లడించారు. యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళా ప్రాంగణంలోని ఎంవీ చౌదరి కళావేదికపై పండుగ వాతావరణంలో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీలలో మొత్తం 10 నాటికలు ప్రదర్శితం కానున్నాయన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని వివిధ కళాపరిషత్‌ల వేదికలపై ప్రదర్శించబడి అవార్డులు పొందిన అత్యుత్తమైన నాటికలను పరిశీలించి ప్రదర్శనకు ఎంపిక చేయడం జరిగిందని సురేష్‌బాబు తెలిపారు.

పెరిగిన సంగం పాల అమ్మకపు ధరలు

పొన్నూరు టౌన్, ఏప్రిల్, 1 (ఆంధ్రజ్యోతి) : సంగం డెయిరీ పాల అమ్మకపు ధరలు లీటరుకు రూ.2ల చొప్పున పెంచినట్లు ఎండీ పీ గోపాలకృష్ణన్ తెలిపారు. సంగం గోల్డ్ ప్లస్ అర లీటరు ప్యాకెట్ ధరను రూ.36 నుంచి 37కు, సంగం డోల్డ్ అర లీటరు ప్యాకెట్ ధరను రూ..35 నుంచి 36కు, టీ స్పెషల్ అరలీటరు ప్యాకెట్ ధరను రూ.34 నుంచి 35కు, ఎస్‌పీఎమ్ ప్యాకెట్‌ను రూ.31 నుంచి 32కు, టీఎం పాలను రూ.28నుంచి 29కు, డీటీఎం పాలు అరలీటరు రూ.26 నుంచి 27కు ధరలు పెంచినట్లు తెలిపారు. పెంచిన ధరలు సోమవారం నుంచి అమలులోకి వచ్చినట్లు మేనేజింగ్ డైరెక్టర్ గోపాలకృష్ణన్ తెలిపారు.

ఆరు పళ్ల విభాగంలో కేసానుపల్లి ఎడ్లకు ప్రథమస్థానం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శనలో ఆరుపళ్ల విభాగంలో దాచేపల్లి మండలం కేసానుపల్లికి చెందిన నెల్లూరు రామకోటయ్య ఎడ్ల జత విజేతగా నిలిచింది. 15 నిమిషాల వ్యవధిలో 3986 అడుగుల దూరం బండ లాగి ప్రథమస్థానంలో నిలిచాయి. తెనాలి మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న ఎడ్ల బల ప్రదర్శన పోటీల్లో ఆరుపళ్ల విభాగంలో 14 జతల ఎడ్లు పోటీ పడ్డాయి. సూర్యాపేట జిల్లా కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ఎడ్ల జత 3900 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానం, ప్రకాశం జిల్లా ఆకివీడుకు చెందిన రైతు పూజితరెడ్డి ఎడ్ల జత 3772 అడుగుల దూరం లాగి తృతీయ స్థానం, సూర్యాపేట జిల్లా మేళ్లచెరువుకు చెందిన రైతులు గోవర్ధనరెడ్డి, రాయుడు సుబ్బారావుల కంబైన్డ్ ఎడ్లజత 3676 అడుగుల దూరం లాగి నాల్గో స్థానం, కృష్ణా జిల్లా యనమలకుదురుకు చెందిన రైతు కావ్యశ్రీ, మధుల ఎడ్ల జత 3600 అడుగుల దూరం లాగి ఐదో స్థానం, వేటపాలెంకు చెందిన రైతు శిరీషా చౌదరి, అనంతవరంకు చెందిన రైతు ఏలూరి సాంబశివరావు కంబైన్డ్ ఎడ్ల జత 3522 అడుగుల దూరం లాగి ఆరో స్థానం, కుక్కలవారిపాలెంకు చెందిన రైతు శివజ్ఞానేశ్వర రెడ్డి, మోక్షితరెడ్డి ఎడ్ల జత 3300 అడుగుల దూరం



విజేత కేసానుపల్లి ఎడ్లతో మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్సీ ఆలపాటి

లాగి ఏడో స్థానం, యద్దనపూడికి చెందిన రైతు ఖాదర్ మస్తాన్, బోగాది పూర్ణ ఎడ్లజత 3094 అడుగుల దూరం లాగి ఎనిమిదో స్థానం, కోదాడకు చెందిన రైతు కొప్పుల శ్రీనివాసరెడ్డి, కుంచనపల్లికి చెందిన రైతు నిక్షిత్ రెడ్డిల కంబైన్డ్ ఎడ్ల జత 2850 అడుగుల దూరం లాగి తొమ్మిదో స్థానంలో నిలిచాయి. విజేతలకు (వరుసగా ప్రథమ నుంచి తొమ్మిదో స్థానం వరకు) దాతలు కొరటాల శ్రీరామమూర్తి కుటుంబ సభ్యులు రూ.50 వేలు, కొడాలి రమణబాబు రూ.40 వేలు, ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి రూ.35 వేలు, ఆళ్ల సురేష్ రెడ్డి, రమేష్‌రెడ్డి, రూ.30 వేలు, బోడపాటి బసవేశ్వరరావు రూ.25 వేలు, వి-ఫర్నీచర్ రామమోహనరావు రూ.20 వేలు, శరణుబాబు రూ.15 వేలు, తాడేపల్లి సూర్యనారాయణమూర్తి రూ.12 వేలు, గుత్తా సోమశేఖర్ రూ.10 వేలు బహుమతులు అందజేశారు. మిగిలిన ఐదుగురు పార్టిసిపెంట్స్‌కు రూ.5 వేలు ప్రోత్సాహక నగదు అందించారు. విజేతలకు ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు బహుమతులు అందజేశారు.

పాల పోటీల్లో పెదరావూరు ఆవుకు ప్రథమ స్థానం

పాల పోటీలలో పెదరావూరు ఆవుకు ప్రథమ స్థానం లభించింది. పోటీల్లో 13మంది రైతులు తమ ఆవులను పోటీలకు తీసుకు వచ్చారు. పశు సంవర్ధక శాఖ అధికారుల పర్యవేక్షణలో సోమవారం పొదుగులను ఖాళీ చేయించారు. మంగళవారం ఉదయం, సాయంత్రం రెండు పూటల తీసిన పాలను కొలిపించగా పెదరావూరు రైతు పాలడుగు సురేంద్రకు చెందిన ఆవు 12.650 లీటర్ల పాలు అందించి ప్రథమ స్థానంలో నిలిచింది. గుంటూరు రైతు పసుపులేటి కృష్ణ ఆవు 10.450 లీటర్ల పాలు అందించి ద్వితీయ స్థానంలో నిలిచింది. మేడికొండూరు రైతు తుబాటి పవన్‌చౌదరి ఆవు 8.80 లీటర్లు, తెనాలి రైతు కంచర్ల సాంబశివరావు ఆవు 6.350 లీటర్ల పాలు అందించి కన్సోలేషన్ బహుమతి పొందాయి. పశు సంవర్ధక శాఖ అధికారులు అడుసుమల్లి మధుసూదనరావు, నరసింహారావు, పద్మావతి, నాగిరెడ్డి, విశ్రాంత అధికారి ఆలపాటి వెంకట్రామయ్య తదితరులు పోటీలను పర్యవేక్షించారు.



ప్రథమ స్థానం పొందిన ఆవుతో రైతు సురేంద్ర

రూ.2015 కోట్లకు చేరిన సంగం టర్నోవర్

చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), ఏప్రిల్, 1 (ఆంధ్రజ్యోతి) : సంగం డెయిరీ వార్షిక టర్నోవర్ రూ.2015 కోట్ల మైలురాయిని అధిగమించిందని చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. వార్షిక టర్నోవర్ రూ.2015 కోట్లు అధిగమించిన సందర్భంగా మంగళవారం వడ్లమూడి సంగం డెయిరీలో విజయోత్సవాలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం చైర్మన్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ తాను 2వసారి సంగం డెయిరీ చైర్మన్ అయ్యేనాటికి రూ.200 కోట్లు మాత్రమే టర్నోవర్ ఉందన్నారు. నేడు పాల రైతులు, వినియోగదారుల ఆదరాభిమానాలు పాలకవర్గం, అధికారులు, సిబ్బంది కృషి కారణంగా రూ. రెండు వేలకోట్ల మైలురాయిని అధిగమించామని తెలిపారు. రాబోయే రోజుల్లో రూ.2200 కోట్ల టర్నోవర్ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రోజుకు 10.50లక్షల లీటర్ల పాలసేకరణ చేస్తున్నట్లు, రాబోయే రోజుల్లో రోజుకు అదనంగా లక్షన్నర లీటర్ల పాలు సేకరించేలా 14 కొత్త చిల్లింగ్ సెంటర్లను ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో తన పైన, సంగం డెయిరీ పైన వైసీపీ పాలకులు వేధింపులకు పాల్పడి అక్రమ కేసులు పెట్టి జైలు పాలు చేశారన్నారు. ప్రభుత్వం కుట్రలను ఉద్యోగులు, రైతులు సంఘటితంగా నిలిచి తిప్పికొట్టారన్నారు. రానున్న రోజుల్లో నూతన ఉత్పత్తులను మార్కెట్లో ప్రవేశపెట్టడమే కాకుండా విదేశాలకు సంగం ఉత్పత్తులను ఎగుమతి చేయనున్నట్లు నరేంద్రకుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ పీ గోపాలకృష్ణన్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సంగం డెయిరీలో కేక్ కట్‌చేస్తున్న చైర్మన్ నరేంద్రకుమార్, సిబ్బంది

బస్సును దొంగిలించిన వ్యక్తి అరెస్టు



బస్సును దొంగిలించుకు వెళుతూ పట్టుబడిన నాగేశ్వరరావు

మేడికొండూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న బస్సును తీసుకెళుతున్న ఓ దొంగ బస్సును వేగంగా నడుపుతూ ముందు వెళు తున్న ఆటోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు వలస కూలీలు గాయపడ్డారు. పేరేచర్ల సమీపంలో మంగళవారం జరిగిన ఈ ప్రమాదంలో గాయపడిన వారిని అంబులెన్స్‌లో గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారిలో ఏడేళ్ల బాలుడు లక్ష్మీనారాయణకు తీవ్ర గాయాలు కాగా తుపాకుల జయమ్మ, సుబ్బారావు, మాణిక్యమ్మతో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. మీరందరూ కర్నూలు జిల్లా నుంచి వలస కూలీలుగా మేడికొండూరు మండలం సరిపూడి గ్రామానికి వచ్చి పొలం పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. పొలం పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా పేరేచర్ల సమీ పంలో బస్సు ఢీకొట్టటంతో ఆటో బోల్తా పడి గాయాలపాలయ్యారు. విషయం తెలుసుకున్న సీఐ షేక్ హాస్సేన్ సాహెబ్ ప్రమాద స్థలానికి చేరుకొని బస్సును వెంబడించి సత్తెనపల్లి సమీపంలోని లయోలా ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఆపి ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని స్టేషన్ తరలించారు.

ఆటోను ఢీకొట్టడంతో వలస కూలీలకు గాయాలు..

మేడికొండూరు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలపరిధిలోని ఎస్ఆర్ఐ కళాశాలకు చెందిన బస్సును డ్రైవరు మందులు కొనుగోలు చేసుకోవడానికి పేరేచర్ల జంక్షన్‌లో ఆపాడు. గుర్తు తెలియని వ్యక్తి వచ్చి బస్సును నడుపుకుంటూ తీసుకెళ్లినట్లు డ్రైవరు పోలీసులకు తెలిపాడు. మేడికొండూరు పోలీసులు పల్నాడు జిల్లా లయోలా ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో బస్సును అదుపులోకి తీసుకొని దొంగను అరెస్టు చేశారు. బస్సు దొంగిలించిన వ్యక్తి జంగారెడ్డిగూడెంనకు చెందిన పొన్నవోలు నాగేశ్వరరావు అని పోలీసులు తెలిపారు. నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంట వ్యవధిలో కేసు ఛేదించిన పోలీసులు

బస్సును దొంగిలించి వలస కూలీల ఆటోను ఢీ కొట్టి, పరారైన బస్సును గంట వ్యవధిలోనే మేడికొండూరు పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటనతో అప్రమత్తమైన సీఐ నాగూర్ మీరా సాహెబ్, ఎస్ఐ ఖాజీబాబు తమ సిబ్బందితో కలిసి సత్తెనపల్లి వైపు పోలీస్ వాహనంతో హుటాహుటిన వెళ్లడంతో దొంగను గంట వ్యవధిలోనే పట్టుకున్నారు.

నేడు ఆలపాటి ప్రమాణ స్వీకారం



గుంటూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు- కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి శాసనమండలికి ఎన్నికైన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ నేడు ప్రమాణస్వీకారం చేయనున్నారు. శాసన మండలి ఛైర్మన్ సమక్షంలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రమాణస్వీకారం చేసేందుకు ముహూర్తం ఖరారైంది. ఆయనతో పాటు శాసన మండలికి ఎన్నికైన మిగతా ఎమ్మెల్సీలు కూడా అదే సమయంలో ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిసింది. వాస్తవానికి ఎమ్మెల్సీ ఎన్నికలు ఫిబ్రవరి 27న జరగ్గా కౌంటింగ్ ప్రక్రియ మార్చి 3న నిర్వహించగా భారీ మెజార్టీతో ఆలపాటి విజయం సాధించారు. అయితే ఇప్పటి వరకు ఆ స్థానంలో కొనసాగుతున్న లక్ష్మణరావు పదవీకాలం మార్చి నెలాఖరు వరకు ఉండటంతో ఆలపాటి ప్రమాణస్వీకారం చేసేందుకు వీలుకాలేదు.

రూ.9.67 లక్షల సిగరెట్లు సీజ్

మాచర్లటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చర్చిబజారులోని శ్రీవినాయక ఫ్యాన్సీ అండ్ జనరల్ స్టోర్స్‌లో రూ.9,67,300 విలు వైన నిషేధిత సిగరెట్లను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. మంగళవారం స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి విజిలెన్స్ అధికారులు ఆ దుకాణంపై దాడులు చేశారు. సీజ్ చేసిన సిగరెట్లను పట్టణ పోలీస్‌స్టేషన్లో అప్పగించి ఫిర్యాదు చేశారు. దాడుల్లో డీసీటీవో రామారావు, ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఆర్ఐ ఇంటూరి అనిల్‌కుమార్, వీఆర్వోలు ఆరుమూళ్ల నాగేశ్వరరావు, అందుగుల రాజారావు తదితరులు పాల్గొన్నారు.



సీజ్ చేసిన సిగరెట్లను పట్టణ పోలీస్‌స్టేషన్లో అప్పగిస్తున్న అధికారులు

కృష్ణానదిలో యువకుడి గల్లంతు



రాజేష్ (ఫైల్‌ఫొటో)

అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని సాయిబాబా మందిరం సమీపంలోని కృష్ణానదిలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు యువకుడు గల్లంతైన ఘటన మంగళవారం మధ్యాహ్నం జరిగింది. ప్రభుత్వ వైద్యశాల వెనుక వైపు ఉన్న కాలనీకి చెందిన నల్లకట్ల రాజేష్(19), మరో పదిమంది యువకులు కలసి చేపలు పట్టుకుని స్నానం చేసేందుకు కృష్ణానదిలోకి వెళ్లారు. వీరిలో రాజేష్ నదిలో మునిగి గల్లంతవడంతో మిగిలిన వారు బయటకు వచ్చారు. గల్లంతైన యువకుడి ఆచూ కీ కోసం రెవెన్యూ, పోలీసు అధికారుల ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు.

1,11,203 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,16,035 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,11,203 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 53,345 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	10500	12400
334	9500	13000	బ్యాడిగి 355	10000	13200
నంబరు. 5	10000	13400	సింజెంటా		
273	10000	12900	బ్యాడిగి 5531	10500	12200
341	10500	14000	దేవనూరు డీలక్స్	10300	12700
4884	10000	11900	ఆర్మూరు	10000	11500
సూపర్ 10	--	--	తాలుకాయలు	5000	6500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					
తేజ	10300	13600			

కన్న కొడుకే కాలయముడయ్యాడు

◆ కూలి డబ్బు కోసం వేధిస్తున్నాడు

◆ కాపాడమని పోలీసులను ఆశ్రయించిన వృద్ధ దంపతులు



వరకుమారి, చంద్రశేఖర్ దంపతులు

వేమూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులకు అండగా ఉంటాడని, చివరి దశలో తలకొరివి పెడతాడని కొడుకుపై గంపెడాశలు పెట్టుకున్న ఆ వృద్ధ దంపతులకు ఇప్పుడు ప్రాణ భయం పట్టుకుంది. బాపట్ల జిల్లా, వేమూరు మండలం, పెరవలి గ్రామానికి చెందిన అమిరె వరకుమారి, చంద్రశేఖర్ వేమూరు పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం విలేకర్లతో తమ గోడు వెళ్లబోసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. తమ ఏకైక కుమారుడైన వీర బసవయ్య తమను బతికుండగానే చిత్రహింసల పాలు చేస్తూ చంపుతామని బెదిరిస్తున్నాడని, ప్రతినిత్యం తాగి వచ్చి తాము కూలి పనులు చేసుకున్న డబ్బు లు ఇవ్వమని కొడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కూలిపై ఆధారపడి జీవించే తాము బతుకుపై ఆశలు వదులుకునే పరిస్థితి ఏర్పడిందని, తమ కుమారుడిపై చర్యలు తీసుకోకపోతే తాము ఏ క్షణమైనా విగత జీవులవుతామన్నారు. న్యాయం జరుగుతుందనే చిరు ఆశతో ప్రాణభిక్ష కోసం పోలీసులను ఆశ్రయించామన్నారు. తమకు న్యాయం చేయాలని ఆ వృద్ధ దంపతులు వేమూరు పోలీసులను వేడుకున్నారు. ఈ విషయాన్ని విలేకరులు ఎస్ఐ దృష్టికి తీసుకురాగా విషయం తన దృష్టికి వచ్చిందని, విచారించి చర్యలు తీసుకుంటామని బాధితులకు తగు భద్రత కల్పిస్తామన్నారు.

గుంటూరు ఛానల్లో మునిగి యువకుడి మృతి



షేక్ జాని (ఫైల్)

పెదకాకాని, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన యువకుడు గుంటూరు ఛానల్లో మునిగి మృతిచెందిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. పెదకాకాని పోలీసుల కథనం ప్రకారం ఆర్టీసీ కాలనీ సమీపంలోని క్రాంతి నగర్‌కు చెందిన షేక్ జాని(18) అతని స్నేహితులైన మహమూద్, వంశీ, లోకేశ్ లతో కలిసి సరదాగా ఈత కొట్టేందుకు గుంటూరు ఛానల్‌కి వెళ్లారు. అక్కడ నీటితో దిగిన క్రమంలో జాని మునిగిపోయాడు. పక్కనే ఉన్న స్నేహితులు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ దొరకలేదు. కొద్దిసేపటికి మృతదేహాన్ని బయటికి తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని పోలీసులు తెలిపారు.

కొడుకును చంపిన తల్లి, తండ్రి అరెస్టు

ఫిరంగిపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఫిరంగిపురం గ్రామంలోని ప్రకాశం పంతులు కాలనీలో అద్దెకు ఉంటున్న కొండవీడు గ్రామస్థులైన కంచర్ల సాగర్, అతని రెండవ భార్య లక్ష్మీ తిరుపతమ్మ ఉరఫ్ లక్ష్మిలు కొడుకు కంచర్ల కార్తీక్‌ను గొంతు పిసికి చంపిన కేసులో తల్లిదండ్రులు ఇద్దరిని అరెస్టు చేశామని ఫిరంగిపురం పోలీసులు మంగళవారం తెలిపారు. నిందితులను మంగళవారం నరసరావుపేట రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎదుట హాజరు పరచగా వారిరువురికి ఈనెల 11వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. కేసును సీఐ బీ రవీంద్రబాబు దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగు రిటైల్ మందుల దుకాణాల లైసెన్స్‌ల రద్దు

● నర్సరావుపేటలో రూ.18.50 లక్షల మందుల సీజ్

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా గత పది రోజులుగా విజిలెన్స్ శాఖ, పోలీసు శాఖతో కలసి ఔషధ నియంత్రణ శాఖ అధికారులు చేపట్టిన తనిఖీలు కొనసాగుతున్నాయి. గుంటూ రులో నాలుగు రిటైల్ మందుల దుకాణాలతో పాటు హోల్‌సేల్ మందుల దుకాణాలను అధికారులు తనిఖీలు చేశారు. హోల్‌సేల్‌షాపులో రికార్డులు సక్ర మంగా ఉన్నట్లు గుర్తించారు. నాలుగు రిటైల్ మందుల షాపుల్లో రికార్డులు స రిగా లేకపోవంతో తాత్కాలికంగా ఆయా దుకాణాల లైసెన్స్‌లను వారం రోజు ల పాటు రద్దు చేశారు. నర్సరావుపేటలో అనధికార గోడౌన్‌లో నిల్వ ఉంచిన రూ.18.50 లక్షల మందులను అధికారులు సీజ్ చేశారు. రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు "ఆపరేషన్ గరుడ" (ఎలైట్ యాంటీ నార్కో టిక్స్ గ్రూప్ ఫర్ లాఎన్‌ఫోర్స్‌మెంట్-ఈగల్) పేరిట మార్చి 21వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా మందుల దుకాణాలపై విజిలెన్స్ శాఖతో కలసి డ్రగ్ కంట్రోల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు జరుపుతున్న విషయం తెలిసిందే. ఈ మత్తు మందులకు యువత బానిసలుగా మారుతున్నట్లు ఆరోపణలు రావడం, పలు వురు రిటైల్ డ్రగ్గిస్టులు ఈ మందులను చట్టవిరుద్ధంగా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో ఈ తనిఖీలు చేపట్టారు. దుకాణాలపై తనిఖీలు కొనసాగుతాయని గుంటూరు ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డీ లక్ష్మణ్ తెలిపారు.

అవనిగడ్డ ప్రమాదంపై పెమ్మసాని ఆరా..

గుంటూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ వద్ద రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందిన తెనాలివాసులు గిడుగు రవీంద్ర మోహన్ బాబు కుటుంబానికి పెమ్మసాని భరోసా ఇచ్చారు. ఢిల్లీలో ఉన్న ఆయన ప్రమాద ఘటన గురించి వార్తా కథనాల ద్వారా తెలుసుకుని మంగళవారం బాధితుల బంధువులకు ఫోన్ చేసి మాట్లాడారు. అధైర్యపడవద్దని వారికి ధైర్యం చెప్పారు. ప్రమాదఘటనపై, సత్వర చర్యలపై సబ్ కలెక్టర్ సంజనా సిన్హాకు పలు సూచనలు చేశారు. ఘటన జరగడానికి గల కారణాలను, అలాగే చికిత్స అందుతున్న విధానాన్ని వైద్యులను కూడా అడిగి తెలుసుకున్నారు. సందీప్, పల్లవిల ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని అయితే, తొడ ఎముకలకు ఫ్రాక్చర్ అయినందువల్ల సర్జరీ చేసే అవకాశం ఉందని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. అనంతరం తెనాలిలోని బంధువులతో అక్కడి పరిస్థితిపై పెమ్మసాని ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి సహకారం అందించేలా కృషి చేస్తానన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగింపు

గుంటూరు (విద్య), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ గురుకుల విద్యాలయాలు, మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు జిల్లా కన్వీనర్ ఐ. జయప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5,6,7,8, తరగతుల్లో మిగిలి ఉన్న ఖాళీలకు, జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం, డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 6వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఏపీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు. ఇతర వివరాల కోసం 87126 25073, 962569140లో సంప్రదించాలని సూచించారు.

73 మంది పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి

● పీఎస్ గ్రేడ్- 4 నుంచి గ్రేడ్- 3గా బాధ్యతలు

గుంటూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 73 మంది పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి లభించిందని జిల్లా పంచాయతీ అధికారి బీ సాయికుమార్ తెలిపారు. 73 మంది పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించడం కోసం మంగళవారం గుంటూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ జరిగింది. మొత్తం 73 మంది గ్రేడ్ -4 పంచాయతీ కార్యదర్శులు కౌన్సిలింగ్‌కు హాజరవగా వారిలో 53 మందికి గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. వారితోపాటు 21 మంది జూనియర్ అసిస్టెంట్లకు కూడా గ్రేడ్- 3 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి లభించింది.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 519.10 అడుగులు ఉంది. ఇది 147.63 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 4050 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6870 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో వాటర్‌గా 13,020 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 2926 క్యూసెక్కుల

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	158, 167, 178
చికెన్ విత్ స్కిన్(కిలో)	306.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	316.00

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

ఉద్యోగావకాశాలు

➺ గుంటూరు సిటీలోని ప్రముఖ సంస్థలో పనిచేయుటకు డ్రైవర్లు, వాచ్‌మెన్‌లు, బాడీగార్డ్‌లు, టెలికాలర్స్, ఆఫీస్ స్టాఫ్ కావలెను. సంప్ర॥ 63051 22366. AJG-210534

➺ గుంటూరులోని ప్రముఖ స్వీట్ షాపు నందు పిండి వంటలు చేయుటకు మహిళలు మరియు సేల్స్ గర్ల్స్ (Q: 10th/Inter) కావలెను. వయస్సు : 18 నుండి 35 లోపు, అనుభవం ఉన్న వారికి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర॥ 91222 34561, 93969 71898. AJG-209967

FLAT FOR SALE

➺ గుంటూరు, అమరావతి రోడ్, BV కన్వెన్షన్ ఎదురు రోడ్, ప్రకాశంనగర్, 2వ లైన్, 2వ అడ్డరోడ్‌లో శ్రీకర నిలయం 5వ ఫ్లోర్ పడమర ఫేసింగ్ 1166 SFT గల ఫ్లాట్ అమ్మకానికి కలదు. సంప్ర॥ +91 91825 36360 AJG-210651

ఇల్లు అమ్మకము

➺ తెనాలి బోసురోడ్డు 120 అ॥ రోడ్‌లో జనసేనపార్టీ ఆఫీసు ఎదురు 121 గ॥లోని పడమర ఫేస్ G+1 బిల్డింగ్ అమ్మబడును. సంప్ర॥ 98480 58932 AJG-210601

రియల్ ఎస్టేట్

➺ అమరావతి IJM రైస్ ట్రీ పార్క్, నంబూరు, కొప్పురావూరు, కంతేరు పరిసర ప్రాంతాలలో VUDA అప్రూవ్డ్ ప్లాట్స్ కావలసిన వారు సంప్రదించండి: M.V. చౌదరి - 9885 163 444. AJG-210533

➺ బాపట్ల జిల్లా, అమృతలూరు గ్రామంలో మంచి లొకాలిటీలో 215 గజాల ఇంటి స్థలం & రోడ్డుకు సమీపంలో 5 ఎకరాల పొలం అమ్మకానికి గలదు. సంప్ర:7893841849. AJH-15007

➺ లాలుపురం, బుడంపాడు మరియు వడ్లమూడి విజ్ఞాన్ ఇంజనీరింగ్ కాలేజీ దగ్గర అతి తక్కువ ధరలకు ప్లాట్లు కలవు. సంప్ర॥ 99591 27008. AJG-210532

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు

ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు

99854 03281


సమయం : ఉ॥ 10:00 గం॥ల నుండి సా॥ 06:00 గం॥ల వరకు (సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

సదా మీ సేవలో



అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు, మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

గుంటూరు 1 టౌన్	- 97036 18725
గుంటూరు 2 టౌన్	- 99854 01056
తెనాలి	- 99854 11202
నరసరావుపేట	- 99854 11206
బాపట్ల	- 99663 35084
పిడుగురాళ్ళ	- 93909 05725
మంగళగిరి	- 93986 73618
అమరావతి	- 95027 86195
పొన్నూరు	- 97042 99094
రేపల్లె	- 99854 12254
చిలకలూరిపేట	- 98852 71281
వినుకొండ	- 99662 50266
మాచర్ల	- 88861 19952
సత్తెనపల్లి	- 91103 23914
ప్రత్తిపాడు	- 63004 34285

సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11214

ఇట్లు : బ్రాంచ్ మేనేజర్

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్ర॥ 99854 11213 99854 11225 99854 01877 99854 04047 99854 01614

సిటీ బస్సులపై.. ఆర్టీసీ కసరత్తు

● ప్రయోగాత్మకంగా రెండు బస్సుల ఏర్పాటు

● పేరేచర్ల వయా గుజ్జనగుండ్ల, కొరిటెపాడు, బస్టాండ్ నుంచి విజయవాడకు

గుంటూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు సిటీ సర్వీసులను అందుబాటులో తెచ్చేందుకు ఆర్టీసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రయోగాత్మంగా రెండు సర్వీసులను ఏర్పాటు చేశారు. మంగళగిరి డిపోకు చెందిన రెండు పల్లె వెలుగు సర్వీసులను పేరేచర్ల నుంచి విజయవాడకు వయా నగరంలోని ప్రధాన ప్రాంతాల గుండా రాకపోకలు సాగించేలా అందుబాటులోకి తెచ్చారు. పేరేచర్లలో ఉదయం 7.30 గంటలకు ప్రారంభమై పెదపలకలూరు, విజ్ఞాన్ నిరుల కళాశాల, గుజ్జనగుండ్ల సెంటర్, కొరిటెపాడు, లాడ్జి సెంటర్, శంకర్‌విలాస్ సెంటర్ నుంచి హిందూ కళాశాల సెంటర్ మీదగా బస్టాండ్‌కు చేరుకుని అక్కడ నుంచి విజయవాడ వరకు రోజుకు 15 ట్రిప్పులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.రవికాంత్ తెలిపారు. ఇప్పటికే పేరేచర్ల నుంచి వచ్చే పల్లెవెలుగు సర్వీసులు నల్లపాడు, హౌసింగ్‌బోర్డు, చుట్టుగుంట, మార్కెట్‌సెంటర్, ఎన్టీఆర్ బస్టాండ్ వరకు రాకపోకలు సాగిస్తున్నాయి. సత్తెనపల్లి నుంచి మరో పల్లెవెలుగు సర్వీసును సిటీ సర్వీసుగా ఏర్పాటు చేస్తున్నారు. పేరేచర్ల నుంచి శ్యామలానగర్ మీదగా కొరిటెపాడు, కలెక్టరేట్ రోడ్డు, నగరంపాలెం, మార్కెట్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు రాకపోకలు సాగించేలా మరో సర్వీసు ఏర్పాటుకు పరిశీలన చేస్తున్నారు.

ప్రజారోగ్యం కోసం ప్రకృతి వ్యాయామశాల

● ప్రారంభించిన ఎస్పీ సతీమణి ధరణ్య

గుంటూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రజారోగ్యం కోసం ప్రకృతి వ్యాయామశాలను ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ చొరవతో ఏర్పాటు చేసిన ఈ వ్యాయామశాలకు అవసరమైన పరికరాలను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కార్పొరేషన్ తరఫున అందించారు. ఈ మేరకు ఏర్పాటైన ఓపెన్ ఎయిర్ వ్యాయామశాలను మంగళవారం ఎస్పీ సతీమణి ధరణ్య ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడు తూ ప్రకృతి వ్యాయామశాలను వినియోగించుకుని తమ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. దీంతో పాటు చిన్న పిల్లలు ఆడుకో వటానికి ఒక ఆట స్థలాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రకృతి వ్యాయామశాలను ఏర్పాటు చేయడంలో కృషి చేసిన సీసీ ఉప్పాల ఆదిశేషు, పోలీస్ జిమ్ ట్రైనర్ కానిస్టేబుల్ శ్రీనివాసరావుని ఎస్పీ అభి నందించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తల్లిదండ్రులు, ట్రైనీ ఐపీఎస్ దీక్ష, ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలురెడ్డి, సీసీ ఉప్పాల ఆదిశేషు, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రకృతి వ్యాయామశాలను ప్రారంభిస్తున్న ఎస్పీ సతీమణి ధరణ్య

విజ్ఞాన్స్ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ప్లాంటేషన్ ప్రోగ్రామ్

గుంటూరు (విద్య) ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ ఫార్మసీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నారాకోడూరులోని సీఎంఎస్ చిల్డ్రన్ హోమ్‌లో ప్లాంటేషన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ.శ్రీనివాసబాబు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎంఎస్ చిల్డ్రన్ హోమ్‌లో మొక్కలు నాటడంతో పాటు విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, పెన్నులు, బుక్స్, టవాళ్లు, ఇతర విద్యాసామగ్రిని అందజేశామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కలిగించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కళాశాలలోని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మొక్కల ప్లాంటేషన్ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఎన్ఎస్ఎస్ అనేది యువతలో సామాజిక బాధ్యతలు పెంచే ముఖ్యమైన పాత్రను పోషిస్తుందన్నారు. అంతేకాకుండా దేశంలో యువతకు సేవా కార్యాలయాలపై అవగాహన కలిగేలా, సామాజిక చైతన్యం పెంచే మార్గంగా పనిచేస్తుందన్నారు. ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్ బాబు తదితరులు

ప్రాంగణ ఎంపికల్లో ఆర్వీఆర్‌జేసీ విద్యార్థులకు ఉద్యోగాలు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రముఖ బ్యాంకింగ్ సేవల రంగ సంస్థ ఇఎస్ఎఫ్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఆర్వీఆర్‌అండ్‌జేసీ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎస్‌డీ, సీఎస్ఎం నుంచి ఒక్కొక్కరు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ నుంచి ఇద్దరు, మెకానికల్ నుంచి ఒకరు, ఐటీ విభాగం నుంచి ఇద్దరు, పీజీ ఎంసీఏ నుంచి ఒకరు ఉద్యోగాలు సాధించారని తెలిపారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ట్రైయినింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం అధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ కె.సురేష్‌బాబు అభినందించారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : నగర పరిధిలో పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులు, అధికారులపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. కమిషనర్ మంగళవారం కృష్ణనగర్, అశోక్‌నగర్, కోబాల్ట్‌పేట, లక్ష్మీపురం, లాలాపేట తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి పారిశుధ్య పనుల లోపంపై పలు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ప్రతి ఇన్‌స్పెక్టర్ తమ డివిజన్లో నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ జరిగేలా, సేకరించిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డ్‌కి తరలించేలా పర్యవేక్షణ చేయాలన్నారు. పర్యటనలో ఎస్ఎస్ రాంబాబు, బయాలజిస్ట్ రామారావు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

3, 4, 7 తేదీలలో దరఖాస్తుల పరిశీలన క్యాంపులు

నగర పరిధిలో 2024-25కి సంబంధించి ఆన్‌లైన్ బెనిఫిషియరీ మేనేజ్‌మెంట్ మోనిటరింగ్ సిస్టం (ఓబీఎంఎంఎస్)లో ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఈ నెల 3వ తేదీ బ్రహ్మానందరెడ్డి స్టేడియం, పశ్చిమ నియోజకవర్గంలో 4న ఎన్టీఆర్‌స్టేడియంలో, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 7న అమరావతి రోడ్డు నవీన స్కూల్లో లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలన క్యాంప్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కాపీ, విద్యార్హతలు, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ పాస్ బుక్, పాన్ కార్డు, ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలు, ఒక పాస్‌పోర్ట్ ఫొటోతో నిర్దేశించిన క్యాంప్‌లకు హాజరుకావాలని కోరారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు

● భవిష్యత్తు కోర్సులపై విద్యార్థుల అన్వేషణ



పరీక్ష కేంద్రాల నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. గత నెల 17 నుంచి ప్రారంభమైన పరీక్షలకు జిల్లాలో 27,000 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారు. 150 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు విద్యాశాఖ, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాల సహకారంతో పూర్తి చేశారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టు దిట్టమైన భద్రత ఏర్పాట్లు నడుమ పరీక్షలు పూర్తి చేశారు. దీంతో విద్యాశాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

3 నుంచి స్పాట్ వాల్యుయేషన్

ఈనెల 3వ తేదీ నుంచి పదవ తరగతి జవాబు పత్రాల వాల్యుయేషన్ ప్రారంభం కానుంది. ఇందుకోసం ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా సబ్జెక్టు టీచర్లతో పాటు నాన్ టీచింగ్ సిబ్బందికి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వాల్యుయేషన్ నిర్వహించనున్నారు గుంటూరు నగరంలోని స్టాల్ స్కూల్లో ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పకడ్బందీగా వ్యాల్యుయేషన్ నిర్వహించిన తర్వాత ఫలితాలు విడుదల కోసం రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు జరుగుతాయని అధికారులు వెల్లడించారు.

భవిష్యత్తు కోర్సులపై విద్యార్థులు దృష్టి

పది పరీక్షలు పూర్తి చేసిన విద్యార్థులు భవిష్యత్తు కోర్సులపై దృష్టిసారించారు. ఇప్పటికే కొంతమంది ఇంటర్లో వివిధ గ్రూపుల గురించి అన్వేషణ ప్రారంభించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎం బైపీసీ, తదితర కోర్సులకు భవిష్యత్తులో ఉండే ఉద్యోగ ఉపాధి అవకాశాలపై విద్యారంగ నిపుణులతో తల్లిదండ్రులు చర్చిస్తున్నారు. మరోవైపు పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ వంటి ప్రవేశ పరీక్షలకు సన్నద్ధమయ్యే పనిలో నిమగ్నమయ్యారు. సాంకేతిక విద్య కోర్సులు ప్రవేశం కోసం పాలీసెట్, ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే గురుకుల జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు ఇప్పటికే నోటిఫికేషన్లు జారీ అయ్యాయి.

ఉపాధి హామీలో పంచ ప్రాధాన్యాలు

● డ్వామా పీడీ శంకర్



ఉపాధిహామీ పథకం కింద నిర్మిస్తున్న పంట కుంట

గుంటూరు సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో పంచ ప్రాధాన్యాల పేరుతో పనులు గుర్తించి చేపట్టనున్నట్లు డ్వామా పీడీ శంకర్ వెల్లడించారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ రానున్న మూడు నెలల్లో వ్యవసాయ పనులు తక్కువగా ఉంటాయి కావున ప్రజలకు ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ మూడు నెలల్లోనే ఏడాది ఉపాధి హామీ ప్రణాళికలోని మెజారిటీ పని దినాలు పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారని వివరించారు. పంచ ప్రాధాన్యతల్లో భాగంగా రాబోయే వేసవిలో పశువుల దాహార్తి తీర్చటానికి గుంటూరు జిల్లాకు కేటాయించిన 41 పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి పశు సంవర్ధక శాఖ వారితో సమన్వయంతో శ్రీకారం చుడతామని తెలిపారు. వర్షాకాలంలో వృధాగా పోయే నీటిని ఒడిసి పట్టేందుకు, సారవంతమైన మట్టి కోతకు గురి కాకుండా ఉండేందుకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి లక్ష్యంగా నిర్దేశించిన 1500 పంట కుంటలలో ఇప్పటికే మంజూరు చేసినపంట కుంటల పనులు పూర్తి చేయటంతో పాటు, నిర్దేశించిన లక్ష్యాల మేరకు మిగిలిన పంట కుంటల నిర్మాణానికి కూడా వెంటనే ప్రతిపాదనలు పంపాలని అన్ని మండలాల ఉపాధి హామీ సిబ్బంది ని ఆదేశించామని తెలిపారు. జిల్లాలోని ఎనిమిది మైనర్ ఇరిగేషన్ చెరువులు పునరుద్దరించటానికి ప్రభుత్వం లక్ష్యం విధించిందని, ఆక్రమణల వలన సహజ రూపం కోల్పోయిన చిన్న నీటి పారుదల చెరువులను గుర్తించి వాటి కట్టలపై ఉన్న పిచ్చిమొక్కలు తొలగించి వాటిని బలోపేతం చేయటం, వాటిపై ఉపాధి హామీ పథకంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని జోడించి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 12672 కిలోమీటర్ల పరిధిలో ఫీడర్, ఫీల్డ్ చానెల్స్, సప్లయ్ చానల్స్‌లో పూడిక తీత పనులను చేపట్టటానికి ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందని పీడీ శంకర్ తెలిపారు.


రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు అధికారుల ప్రణాళిక

గుంటూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. అడ్మిన్ అదనపు ఎస్పీ రమణకుమార్, ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో ఈస్ట్, వెస్ట్ ట్రాఫిక్ సీఐలు అశోక్‌కుమార్, సింగయ్య తదితరులు మంగళవారం మరోసారి నగరంలోని ఆయా బ్లాక్ స్పాట్‌ను పరిశీలించి ముందు జాగ్రత్త చర్యలకు ప్రణాళికలు రూపొందించారు. గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చుట్టుగుంట సెంటర్, పట్టాభిపురం బ్రిడ్జి కింద, గుజ్జనగుండ్ల సెంటర్, నవభారత నగర మెయిన్ రోడ్లలో ఇటీవల రోడ్డు ప్రమాదాలు సంభవించిన ప్రాంతాలను డ్రోన్ కెమెరా సహాయంతో పరిశీలించి వేగ నియంత్రికాలు, డివైడర్ల ఏర్పాటు, సీసీ కెమెరాలు, స్టాప్ బోర్డులు, రోడ్ల మీద జీబ్రా క్రాసింగ్ గీతలు, రేడియం స్టిక్కర్స్ మొదలగునవి ఏర్పాటు చేయవలసిందిగా ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్యకి అదనపు ఎస్పీ రమణకుమార్ సూచనలు ఇచ్చారు.

పోలీస్ శాఖకు అందించిన సేవలు అభినందనీయం

● రిటైర్డ్ పోలీస్ అధికారులకు ఘన సన్మానం

గుంటూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘ కాలం పోలీస్ శాఖకు అందించిన సేవలు అభినందనీయమని జిల్లా అదనపు ఎస్పీ రమణమూర్తి అన్నారు. సీఐ సామినేని శ్రీనివాసరావు, ఎస్సై కోడూరు శ్రీనివాసరావు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ గల్లా శ్రీనివాసరావు సుదీర్ఘకాలం పోలీస్ శాఖకు తమ అమూల్యమైన సేవలందించి ఉద్యోగ విరమణ పొందారన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఉద్యోగ విరమణ పొందిన పోలీసులను జిల్లా అదనపు ఎస్పీ రమణమూర్తి పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలరెడ్డి, వెల్ఫేర్ ఆర్ఐ శివరామకృష్ణ, రాష్ట్ర పోలీస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దళవాయి సుబ్రహ్మణ్యం, జిల్లా పోలీస్ అసోసియేషన్ సభ్యులు లక్ష్మయ్య, కరిముల్లా, సహోద్యోగులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ పొందిన వారిని సత్కరిస్తున్న పోలీస్ అధికారులు

నేడు ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

గుంటూరు విద్య, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో (ఫ్యాప్టో) బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు కే.నరసింహారావు, కే.వీరాంజనేయులు బుధవారం వెల్లడించారు. 12వ పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయడం, 30 శాతం ఐఆర్ మంజూరు, మిగిలి ఉన్న ఆర్థిక బకాయిలు, జడ్పీ పీఎఫ్ లోన్స్, ఏపీజీఎల్ఐ క్లోజర్స్, సరెండర్ లీవ్స్ విడుదల, సీపీఎస్, జీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడం, కారుణ్య నియమకాలు తదితర సమస్యలపై కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేయనున్నట్లు వివరించారు. ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్ యు.రా జశేఖర్‌రావు, డీకే సుబ్బారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.వేళాంగిణిరాజు, పీ.ప్రసాద్, ఫ్యాప్టో జిల్లా నాయకులు ఎం.సాంబశివరావు, ఎంపీ సుబ్బారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మంత్రులకు సామూహిక రాయబారాన్ని జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ సంక్షేమ బోర్డుని పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 24న మంత్రులకు సామూహిక రాయబారం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. పాతగుంటూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో బి.సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో హామీ మేరకు తక్షణమే భవన నిర్మాణ సంక్షేమం బోర్డును పునరుద్ధరించి కార్మికులను ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో టి.శ్రీనివాసరావు, బాబురావు, దీవెనరావు, ఎస్‌కే బాషా, విమల్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం : రావిపాటి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని సవిత నాయిబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాంబయ్య అన్నారు. గుంటూరులో సామాజిక బాధ్యత వ్యక్తిగత భద్రత అనే అంశంపై మంగళవారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి వల్లూరి సాంబ అధ్యక్షత వహించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయటం వల్ల చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని సాంబయ్య అన్నారు. పలువురికి జిల్లా సంఘం ఆధ్వర్యంలో హెల్మెట్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి జాజాల ధనబాబు, సలహాదారులు పరిటాల శ్రీకృష్ణ, మున్నంగి శివ, ప్రచార కార్యదర్శి నాగ మల్లేశ్వరరావు, అద్దేపల్లి నాగేశ్వరరావు, ఇనపగుర్తి అయ్యప్ప, యర్రవరపు బాల మనోజ్, కటారి అనిల్‌పాల్గొన్నారు.

14న రాజ్యాధికార సాధన సదస్సు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 14న సామాజిక న్యాయ సాధన-రాజ్యాధికార సాధన సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్రీయ మహాజన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కంభం ఆనంద్ కుమార్ తెలిపారు. స్థానిక లాడ్జి సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. అమరావతి రోడ్డు మదర్ థెరిస్సా కమ్యూనిటీ హాలులో ఈ సదస్సు జరుగుతుందని తెలిపారు. సదస్సుకు ముందు అరండల్‌పేట 14వ లైన్ నుంచి కమ్యూనిటీ హాల్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పిల్లి రాంబాబు, కంతేటి కోటేశ్వరరావు, యెహోవా, ఆనందరావు బండి అమర్, సాంబయ్య, ఆదయ్య తదితరులు పాల్గొన్నారు.

పైపులు ధ్వంసం చేసిన మున్సిపల్ సిబ్బంది

● కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన బాధితుడు

గుంటూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ఓ ప్రైవేటు స్థలం విషయంలో మున్సిపల్ సిబ్బంది రెచ్చిపోయారు. నగరపాలక సంస్థలో పని చేసే ఉద్యోగి చెప్పాడనే కారణంతో వారు మున్సిపాలిటీకి చెందిన జేసీబీతో వచ్చి ఆయా పైపులను ధ్వంసం చేసారు. బాధితుడి కథనం ప్రకారం బృందావన్ గార్డెన్స్ మూడో లైనుకు చెందిన కొత్తపల్లి కిరణ్ బాబు తన ఇంటి ప్రహరీ పక్కన తమకు ఖాళీ స్థలం ఉందన్నారు. అందులో ఇటీవల తాను పైపులు బిగించినట్లు తెలిపారు. గత మార్చి 26న మున్సిపాలిటీకి చెందిన సిబ్బంది తాను ఇంటిలో లేని సమయంలో జేసీబీతో వచ్చి పైపులను విరగ్గొట్టి నేలమట్టం చేశారన్నారు. ఆ పక్కనే ఉంటున్న ఓ మున్సిపల్ ఉద్యోగి వ్యక్తిగత కక్షతో ఇచ్చిన సమాచారంతో తన స్థలంలోకి ప్రవేశించడమే గాక పోల్స్‌ను ధ్వంసం చేశారన్నారు. దీని కారణంగా తనకు 75 వేల నష్టం వాటిల్లిందన్నారు. కనీసం ఎటువంటి నోటీస్ కూడా ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా తన పైపులను ధ్వంసం చేశారని తగు చర్యలు తీసుకోవాలని కిరణ్ బాబు నగర కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

ఐరన్ ముఠా కార్మికుల కూలీ రేట్లను పెంచాలి

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఐరన్ దుకాణాల్లో పని చేస్తున్న ముఠా కార్మికుల కూలీ రేట్లను పెంచాలని ఆంధ్రప్రదేశ్ హమాలీ, ముఠా ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన్న ఆంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక రేగుల రాఘవయ్య భవనంలో మంగళవారం ఐరన్ ముఠా వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడూతూ కూలీ రేట్ల ఒప్పందం కాలపరిమితి ముగిసినప్పటికీ కొత్త ఒప్పందం చేయడానికి యాజమాన్యం ముందుకు రావడం లేదని అన్నారు. యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బుధవారం నుంచి ముఠా కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో నగర ముఠా కార్మిక సంఘం అధ్యక్షుడు జి.సురేష్ బాబు, రావుల అంజిబాబు, పప్పుల రోశిరెడ్డి, మల్లె బోయినపిచ్చయ్య, ఆదం, శీను, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ కార్మికుల పదవీ విరమణ కొనసాగించాలి : సీపీఐ

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ కార్మికుల రిటైర్మెంట్ వయసు 62 నుంచి 60కి తగ్గించడాన్ని విరమించుకోవాలని, వారిని గతంలోవలే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మల్యాద్రి డిమాండ్ చేశారు. జీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట మంగళవారం కార్మికులతో బైఠాయించి ఆందోళన చేపట్టారు. అనంతరం కమిషనర్ పులి శ్రీనివాసులుని కలిసి వినతి పత్రం అందజేశారు. ధర్నాలో యూనియన్ నాయకులు వీరాంజనేయులు, రమేష్, రాంబాబు, మంగమ్మ, నాగమ్మ, కోటేశ్వరరావు, బసవమ్మ, భూలక్ష్మి, ఏడుకొండలు, వీరమ్మ, ఏసు, అన్నమ్మ తదితర కార్మికులు పాల్గొన్నారు.

పోరాటయోధురాలు అహల్యాబాయి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమయంలో అహల్యాబాయి చేసిన పోరాటాలు ప్రశంసనీయమని డాక్టర్ తూనుగుంట్ల రాధాబాయి అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికగా మంగళవారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళావిభాగం వారి కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సభ్యులు బొర్రా ఉమామహేశ్వరరావు, ఊటుకూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. కార్యదర్శి డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి వాల్మీకి రామాయణం సుందరకాండపై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. అనంతరం కళారత్న పురస్కారం స్వీకరించిన దేవాలయ పాలకవర్గం అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్యను మహిళా విభాగం ఘనంగా సత్కరించారు.

డాక్టర్ ఓవీ రమణకు సత్కారం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి మెడిసన్ సోషల్ సర్వీస్ విభాగంలో కళారత్న అవార్డు అందుకున్న శ్రీ షిర్డీ సాయి ఆధ్యాత్మిక సేవాసమితి వ్యవస్థాపకుడు, ప్రముఖ హోమియో వైద్య నిపుణుడు డాక్టర్ ఓరుగంటి వెంకటరమణను ఆయన కార్యాలయంలో పలువురు ఘనంగా సత్కరించారు. సత్కరించిన వారిలో షిర్డీ సాయి ఆధ్యాత్మిక సేవా అధ్యక్షుడు ఓరుగంటి విశ్వనాధం, సభ్యులు వాణీ సుజాత, పి.ఏడుకొండలు, ఎన్.సుందరరావు ఉన్నారు.

అప్పుల ఊబిలో రైతాంగం : కంచుమాటి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధర లేక గత ఆరేళ్ల నుంచి రైతాంగం తీవ్ర అప్పుల ఊబిలో కూరుకుపోయారని రైతు సంఘ జిల్లా కార్యదర్శి కె.అజయ్ కుమార్ అన్నారు. బ్రాడీపేటలోని రైతు సంఘం కార్యాలయంలో మంగళవారం జొన్న శివశంకర్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్చి క్వింటాకు కనీస మద్దతు ధర క్వింటా రూ.20 వేలు ఉండాలన్నారు. సమావేశంలో పాశం రామారావు, వల్లూరి భారతి,శివ, సాంబిరెడ్డి, భాస్కరరావు పాల్గొన్నారు.



లక్ష్మమ్మకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్, కార్పొరేటర్ భారతి

పెద్ద దిక్కుగా ఎన్టీఆర్ పింఛన్ భరోసా

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పెద్ద దిక్కును కోల్పోయిన, ఆదరువు కోల్పోయిన ప్రతి ఇంటికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్ భరోసా ఇస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 53వ డివిజన్ సంజీవనగర్‌లో మంగళవారం ఉదయం ఆయన పింఛన్లు అందజేశారు. మార్చి నెలలో భర్తను కోల్పోయిన మద్దినేని లక్ష్మమ్మకు ఏప్రిల్ నెలలోనే ఆమెకు వితంతు కోటాలో పింఛను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇంట్లో భర్త మరణిస్తే ఆ మరుసటి నెలలో భార్యకు వితంతు పింఛను అందేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో లక్ష్మమ్మకు ఈనెలలోనే రూ.4 వేలు పింఛన్ మంజూరైందని చెప్పారు. వెంగళరావునగర్‌కు చెందిన కోలా మరియమ్మ వివిధ పనులపై వేరే ప్రాంతానికి వెళ్లి మూడు నెలల తర్వాత తిరిగి రాగా ఆమెకు కూడా మూడు నెలల పింఛను కలిపి మొత్తం రూ.12వేలు అందజేశామన్నారు. గత ప్రభుత్వంలో ఒకనెల అందుబాటులో లేకపోతే మరుసటి నెల ఆ పెన్షన్‌కు ఎగనామం పెట్టారని, తమ ప్రభుత్వం మూడు నెలలకు కలిపి పింఛను అందిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భారతి, గోళ్ళ ప్రభాకర్, గుడిమెట్ల దయారత్నం, వంగర ఏడుకొండలు, గొట్టిపాటి బాబు, నవీన్, కిషోర్, కోట పిచ్చిరెడ్డి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నసీర్ ఆత్మీయ ఆతిథ్యం

ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ మంగళవారం ఈద్-మిలాప్ ఆతిథ్యం ఇచ్చారు. రంజాన్ పండుగ అనంతరం మంగళవారం గుంటూరులోని శ్రీ స్క్వేర్ కన్వెన్షన్‌లో కూటమి నేతలకు ఎమ్మెల్యే ఆత్మీయ ఆతిథ్యం ఇచ్చారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, తెనాలి శ్రావణ్ కుమార్, ఏపీ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ తదితరులు హాజరయ్యారు. వీరితోపాటు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల పట్ల ప్రభుత్వ పనితీరు ప్రశంసనీయం

● అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ జాగర్లమూడి శ్రీనివాసరావు



డయాలసిస్ పేషెంట్‌కు రూ.10 వేల పెన్షన్ అందజేస్తున్న టీడీపీ నాయకుడు జాగర్లమూడి తదితరులు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పేదల పట్ల ప్రభుత్వ పనితీరు ప్రశంసనీయమని రాష్ట్ర టీడీపీ నాయకుడు, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ జాగర్లమూడి శ్రీనివాసరావు తెలిపారు. పాతగుంటూరు 12 సచివా లయం పరిధిలో డయాలసిస్ పేషెంట్ నాగుల శ్రీనివాస రావుకు రూ.10 వేలు పెన్షన్ కొత్తగా మంజూరు కాగా అతనికి మంగళవారం అందజేశారు. జాగర్లమూడి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎందరో పేదలకు వివిధ రకాల పెన్షన్లను అందిస్తూ ప్రభుత్వం వారికి చేయూత అందిస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు ఇర్రి సాయి, డివిజన్ తెలుగుదేశం అధ్యక్షుడు జశ్వంత్, పార్టీ నాయకులు ఇలా శ్రీను, వరమ్మ, భాస్కర్, శ్రీను నాయక్, యంపరాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఎస్పీకి కారు పత్రాలు, తాళాలు అందజేస్తున్న పయనీర్ ఆటో మొబైల్ అధినేత చుక్కపల్లి రమేష్, చిత్రంలో ట్రైనీ ఐపీఎస్ దీక్షా, అదనపు ఎస్పీ సుప్రజ తదితరులు

జిల్లా పోలీస్ శాఖకు కారు వితరణ

గుంటూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్ శాఖకు దాతలు కారు బహూకరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో కారు తాళాలను పయనీర్ ఆటోమొబైల్స్ అధినేత చుక్కపల్లి రమేష్ మంగళవారం ఎస్పీ సతీష్‌కుమార్‌కు అందజేసారు. ఎస్పీ మాట్లాడుతూ సమాజానికి పోలీసులు మెరుగైన సేవలు అందించడానికి దాతలు తమ సహాయాన్ని అందించాలని పిలుపునిచ్చారు. మహీంద్రా కారును బహుకరించిన దాతలు పయనీర్ ఆటోమొబైల్స్ అధినేత చుక్కపల్లి రమేష్, చేబ్రోలు హనుమయ్య కుమారుడు చేబ్రోలు నరేంద్ర, భారతి కన్స్యూమర్ కేర్ ప్రొడక్ట్స్ (త్రిపుల్‌ఎక్స్) అధినేత దివంగత మాణిక్యవేల్‌కు ధన్యవాదాలు తెలిపారు. పయనీర్ ఆటోమొబైల్స్ అధినేత చుక్కపల్లి రమేష్ వాహనం పత్రాలను, తాళాలను ఎస్పీకి అందించారు. దాతల ద్వారా జిల్లా పోలీస్ విభాగానికి కారుని తీసుకురావడంలో కృషి చేసిన నల్లపాడు సీఐ వంశీధర్‌ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు ట్రైనీ ఐపీఎస్ దీక్ష, అదనపు ఎస్పీలు జీవీ రమణమూర్తి(అడ్మిన్), సుప్రజ (క్రైమ్స్), డీఎస్పీలు భానోదయ (సౌత్), ఏడుకొండలురెడ్డి (ఏఆర్), నల్లపాడు సీఐ వంశీధర్, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సూర్యలంకలో సందడి

దీక్షల ముగింపుతో తీరానికి పోటెత్తిన ముస్లింలు


సూర్యలంక సముద్రతీరంలో స్నానాలు ఆచరిస్తున్న ముస్లిం సోదరులు, కుటుంబ సభ్యులు


చిన్నారులతో ముస్లిం పెద్ద


ఇసుకతో ఆటలాడుతున్న యువకులు


గజఈతగాళ్ళతో గస్తీ నిర్వహిస్తున్న మెరైన్, రూరల్ పోలీసులు

బాపట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్రతీరం మంగళవారం ముస్లిం సోదరులతో పోటెత్తింది. నెలరోజులుగా ఉపవాసదీక్షలు చేసి రంజాన్ వేడుకను ఘనంగా జరుపుకున్న ముస్లింకుటుంబాలంతా కలిసి తీరానికి వచ్చి పుణ్యస్నానాలు ఆచరిస్తూ సంతోషంగా, సరదాగా గడిపారు. బాపట్ల పరిసరప్రాంతాలు నుంచే కాకుండా రెండు తెలుగురాష్ట్రాల నుంచి విచ్చేసిన భక్తులతో తీరం కిక్కిరిసింది. ఇసుక తిమ్మెర్లతో యువత ఆటలాడుతూ సందడి చేశారు. చిన్నారులను సైతం స్నానాలు చేయిస్తూ పెద్దలు కనిపించారు. ప్రత్యేక వాహనాలలో తరలి రావటంతో తీరం వెంట బారులు తీరి జనం ఉన్నారు. సుమారు 60వేలమంది వచ్చిఉంటారని పంచాయతీ అధికారులు పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యాటకులు వస్తూనే ఉన్నారన్నారు. వాహనాల రాకపోకలతో అక్కడక్కడ కొన్ని అవాంతరాలు తలెత్తాయి. ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మెరైన్, రూరల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గజ ఈతగాళ్ళు గస్తీ నిర్వహించి ప్రమాదాలు జరగకుండా చూశారు. గ్రామపంచాయతీ అధికారులు పర్యాటకులకు వసతులు కల్పించారు. తీరానికి విచ్చేసిన ముస్లిం సోదరులంతా కలిసి తీరం వెంట భోజనాలు చేసి సంతోషంగా గడిపారు. ప్రతి ఏడాది రంజాన్ వేడుక మరుసటి రోజు తీరానికి పర్యాటకులు రావటం పరిపాటిగా మారింది. ఈఏడాది అనుకున్న దానికన్నా ఎక్కువ సంఖ్యలో ముస్లిం సోదరులు తీరానికి తరలి వచ్చారు.

24 గంటలూ అందుబాట్లో
ఆర్థోపెడిక్ ఓటీ

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాల 1999వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల వితరణతో ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఆర్థోపెడిక్ విభాగంలో నూత నంగా ఏర్పాటు చేసిన ఆపరేషన్ థియేటర్‌ను రూ.లక్షన్నరతో అభివృద్ధి


ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభిస్తున్న రమణ యశస్వి

చేశారు. రూ.లక్షతో వైద్యపరికరాలను సమకూర్చారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడి చికిత్స కోసం వచ్చే రోగులకు ఆర్థోపెడిక్ విభాగంలో ఈ ఆపరేషన్ థియేటర్ 24 గంటలూ అందుబాట్లో ఉంటుందని ఆర్థోపెడిక్ ప్రొఫెసర్, సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ వీవీ నారాయణరావు, మత్తు విభాగాధిపతి డాక్టర్ పోలయ్య, ఎన్టీఆర్ వైద్య సేవ నోడల్ అధికారి డాక్టర్ అనిల్ పాల్గొన్నారు.

ఫిజియాలజీ లెక్చర్ గ్యాలరీ హాల్ ఆధునికీకరణ...

గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థి, న్యూరోసర్జన్ డాక్టర్ ఉప్పుటూరి హేమంత్ జీఎంసీ ఫిజియాలజీ విభాగంలో లెక్చర్ గ్యాలరీ హాల్ ఆధునికీకరణకు తగిన ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. ఇక్కడ వైద్య విద్యను అభ్యసించిన సమయంలో డాక్టర్ హేమంత్ ఫిజియాలజీ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ నేపథ్యంలో ఈ విభాగం అభివృద్ధికి సాయం చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి కోరగా, డాక్టర్ హేమంత్ అంగీకరించారు. ఇప్పటికే ఫిజియాలజీ లెక్చర్ గ్యాలరీ హాల్‌లో అభివృద్ధి పనులు చేపట్టారు.

క్యాంటీన్ పనుల ప్రారంభం...

గుంటూరు వైద్య కళాశాలలో విద్యార్థులకు, వైద్య బోధన సిబ్బంది కోసం ఆధునిక రీతిలో క్యాంటీన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం నాడు ప్రిన్సిపాల్ సుందరాచారి పూజా కార్యక్రమాలతో నిర్మాణ పనులను ప్రారంభించారు. సుమారు రూ.40 లక్షలతో చేపడుతున్న ఈ క్యాంటీన్ నిర్మాణానికి 1993వ బ్యాచ్ పూర్వ విద్యార్థి, ప్రముఖ స్పైన్ సర్జన్ డాక్టర్ జే నరేష్‌బాబు వ్యక్తిగతంగా రూ.25 లక్షల ఆర్థిక సాయం అందజేస్తున్నారు.

అతిగా పురుగు మందుల వాడకం అనర్థం

● ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయ ఏడీఆర్ డాక్టర్ దుర్గాప్రసాదు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పంటలో ఇష్టాను సారంగా పురుగుమందులు వినియోగించడంతో సరైన ఫలసాయం అందకపోగా ఖర్చు పెరుగుతుందని ఆచార్య ఎన్జీ రంగా విశ్వావిద్యా లయం అసిస్టెంట్ డైరక్టర్ ఆఫ్ రిసెర్చ్(ఏ డి ఆర్) డాక్టర్ దుర్గాప్రసాదు అన్నారు. మంగళవారం ఎన్విరో ఈక్విటీ హెల్త్ ఇనిషియేటివ్ స్వచ్ఛంద సేవా సంస్థ, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామ రైతులకు పురుగు మందులు 'సురక్షితంగా వాడండి- ఆరోగ్యంగా ఉండండి' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు జొన్నకూటి శ్రీయ, వ్యవసాయ శాస్త్రవేత్తలు సాంబశివరావు, డయానాతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాదు మాట్లాడుతూ దిగుబడుల కోసం పురుగు మందుల వాడకం పెరిగిపోయిందని చెప్పారు. మిగిలిన దేశాల్లో సమగ్ర సస్యరక్షణ పాటిస్తారని, మన దేశంలో మాత్రం ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా పురుగుమందులు వాడుతున్నారని చెప్పారు. వ్యవసాయ రంగంలో త్వరలో డ్రోన్ టెక్నాలజీ రానుందని వెల్లడించారు. జొన్నకూటి శ్రీయ మాట్లాడుతూ పురుగు మందులు వాడకంలో జాగ్రత్తలు



మాట్లాడుతున్న డాక్టర్ దుర్గాప్రసాదు, పాల్గొన్న జొన్నకూటి శ్రీయ, వంగా నవీన్‌రెడ్డి తదితరులు

తీసుకోని పక్షంలో క్యాన్సర్, అలర్జీ, మెదడు, నరాల సంబంధమైన జబ్బులు తోపాటు గర్భంలో బిడ్డలకు కూడా ప్రమాదం పొంచి ఉందన్నారు. పురుగు మందులు వాడిన అనంతం డబ్బాలు భూమిలో పాతిపెట్టాలన్నారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ మాజీ ఉపసర్పంచ్ వంగా నవీన్ రెడ్డి, లాం జనసేన పార్టీ నాయకులు ఎం సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇటుక పరిశ్రమకు గడ్డు పరిస్థితులు

కొల్లూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రాష్ట్రంలో కొల్లూరు ఇటుక పరిశ్రమ ఎంతో ప్రసిద్ధి చెందింది. కొల్లూరు మండల పరిధిలోని కృష్ణానది పరివాహక ప్రాంతంలో దొరికే బుసకతో కూడిన మట్టి ఇటుక తయారీకి అనుకూలమైనది కావడంతో ఇక్కడ తయారయ్యే ఇటుకలు ఎంతో మన్నిక కలవని పేరు పొందాయి. అలాంటి పరిశ్రమ నేడు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుంది. గతంలో ఈ ప్రాంతంలో సుమారు 180 ఇటుక పరిశ్రమలు ఉండగా నేడు అవి సగానికి పడిపోయాయి. ఇటుక తయారీకి వ్యయం పెరగడంతో పాటు అదే సమయంలో ఇటుక ధరలు తగ్గడంతో వ్యాపారులు నష్టాల పాలవడంతో ఈ ఏడాది ఇటుక ఉత్పత్తిని తగ్గించేశారు. కొల్లూరు ఇటుక


కొల్లూరు మండలంలో ఇటుక ఉత్పత్తి చేస్తున్న కార్మికులు

పరిశ్రమలలో ప్రతి ఏటా డిసెంబరు నుంచి మే వరకు ఇటుక తయారీ జరుగుతుంది. ఇటుక తీసేందుకు నెల్లూరు, ప్రకాశంతో పాటు విశాఖ, రాజమండ్రి, శ్రీకాకుళం జిల్లాల నుంచి కూలీలు తమ కుటుంబాలతో ఇక్కడకు వలస వచ్చి ఆరు నెలల పాటు ఇటుక బట్టీల వద్ద తమ నివాసాన్ని ఏర్పరచుకుంటారు. వీరితో పాటు స్థానికంగా ఉన్న మండల గ్రామాలతో పాటు భట్టిప్రోలు, వేమూరు మండలాల నుంచి కూడా ఇటుక పరిశ్రమలలో పనులు చేసేందుకు నిత్యం వందలాది మంది కూలీలు వచ్చి ఉపాధి పొందుతారు. ఈ ఏడాది ఇటుక ధరలు తగ్గిపోవడంతో పాటు గత ఏడాది తయారు చేసిన ఇటుకలు కూడా అమ్ముడు కాకపోవడంతో పరిశ్రమదారులు ఉత్పత్తిని తగ్గించి వేశారు. డిసెంబరులో ప్రారంభం కావాల్సిన ఇటుక ఉత్పత్తి జనవరి మధ్యలో ప్రారంభించారు. కోటి ఇటుకలు తీసే పరిశ్రమదారులు సైతం ప్రస్తుతం 50 లక్షల ఇటుకలు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారు. 180 పరిశ్రమలలో ప్రస్తుతం 90 నుంచి 100 పరిశ్రమలు మాత్రమే ఇటుక ఉత్పత్తిని చేస్తున్నాయి. ప్రస్తుతం ఒక్కో ఇటుక తయారీకి రూ.5.30లు ఖర్చు అవుతుండగా ఇటుక అమ్మకాలు మాత్రం రూ.4.50 నుంచి రూ.4.80లు మాత్రమే జరుగుతుండటంతో పరిశ్రమదారులకు ఒక్కొక్క ఇటుకకు రూ.50 పైసలు నుంచి రూ.80 పైసలు వరకు నష్టం వస్తున్నట్లు చెబుతున్నారు. వెయ్యి ఇటుకకు రూ.500-800 అమ్మకాల్లో నష్టం వాటిల్లుతుండటంతో ఈ ఏడాది ఉత్పత్తి సగానికి సగం తగ్గించి వేశామని పరిశ్రమదారులు చెబుతున్నారు. ఉత్పత్తులు తగ్గడంతో ఆ ప్రభావం కూలీల జీవనంపై పడటంతో సగానికి సగం మంది ఈ ఏడాది ఇటుక పరిశ్రమల్లో పనులు లేకుండా పోయాయని పరిశ్రమ వర్గాలే చెబుతున్నాయి. రియల్ ఎస్టేట్ పుంజుకుని ఇటుక ధరలు పెరిగితే ఇటుక పరిశ్రమ మనుగడ కొనసాగుతాయని అంటున్నారు. లేదంటే పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది.

నరసరావుపేటలో బర్డ్‌ఫ్లూ మరణం!

● రెండేళ్ల చిన్నారి మృతి

● గుంటూరులో హెచ్5ఎన్1 సర్వెలెన్స్ సెంటర్‌కు ఆమోదం



గుంటూరు మెడికల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా నరసరావుపేటలో బర్డ్‌ఫ్లూ (ఎవియన్ ఇన్‌ఫ్లూయెంజా/ హెచ్5 ఎన్1) మరణం నమోదైంది. నరసరావుపేట పట్టణంలోని బాలయ్య నగర్‌కు చెందిన పెండ్యాల జ్యోతి అనే రెండేళ్ల చిన్నారి బర్డ్‌ఫ్లూతో మరణించినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు మంగళవారం ధ్రువీకరించారు. గత నెలలో చిన్నారి బర్డ్‌ఫ్లూకు గురవ్వగా, కుటుంబీకులు చికిత్స కోసం మంగళగిరిలోని ఎయిమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ గత వారం చిన్నారి మృతి చెందగా, వ్యాధి లక్షణాలు బర్డ్‌ఫ్లూగా అనుమానించిన వైద్యనిపుణులు రక్తనమూనాలను పూణేలోని నేషనల్ వైరాలజీ ల్యాబ్‌కు పంపారు. జ్యోతి బర్డ్‌ఫ్లూతో మృతి చెందినట్లు సోమవారం ల్యాబ్ రిపోర్ట్ నిర్ధారించింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నేతృత్వంలో వైద్య సిబ్బంది స్థానికంగా సర్వెలెన్స్ చేపట్టారు.

పల్నాడు డీఎంహెచ్‌వో అభ్యర్థన మేరకు గుంటూరు నుంచి మంగళవారం ర్యాపిడ్ రెస్పాన్స్ మెడికల్ టీమ్ నరసరావుపేటకు వెళ్లింది. ఈ బృందంలో సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సీతారామతో పాటు మైక్రోబయాలజీ, శిశువైద్యనిపుణులు ఉన్నారు. వీరు పట్టణంలోని బాలయ్య నగర్ పరిసర ప్రాంతాల్లో సర్వెలెన్స్ జరిపి నివేదికను డీఎంహెచ్‌కు అందజేస్తారు. పెండ్యాల జ్యోతి కుటుంబంలో ఇతర సభ్యులు ఆరోగ్యంగా ఉన్నారని, ఎవరికీ ఈ జబ్బు సోకిన దాఖలాలు లేవని వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు వెల్లడించాయి. ముందస్తు జాగ్రత్తగా స్థానికంగా వైద్య సిబ్బంది సర్వెలెన్స్ చేపట్టారు. బర్డ్‌ఫ్లూ మనుషులకు సోకడం అరుదు. బర్డ్‌ఫ్లూ రోగుల్లో 50 శాతం మంది మృతి చెందే ప్రమాదం ఉందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

గుంటూరులో బర్డ్‌ఫ్లూ సర్వెలెన్స్ సెంటర్...

ఇదిలా ఉంటే గుంటూరులో రీజనల్ బర్డ్‌ఫ్లూ సర్వెలెన్స్ సెంటర్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు గత వారం వైద్య కళాశాల మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ జయలక్ష్మీకి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నుంచి సమాచారం అందింది. వైద్య కళాశాల ఆవరణలోని స్టేట్ రిఫరల్ వైరాలజీ ల్యాబ్‌కు అనుబంధంగా బర్డ్‌ఫ్లూ సర్వెలెన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు. ప్రత్యేకంగా వైద్య పరికరాలు, ల్యాబ్ కన్స్యూమ బుల్స్ ఇతర అవసరమైన వాటిని అందజేస్తారు. 'ఇది రీజరల్ బర్డ్‌ఫ్లూ సర్వెలెన్స్ సెం టర్. గుంటూరు జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ అనుమానిత కేసులు నమోదైనప్పుడు ఇక్కడ వైద్యనిపుణులు సర్వే చేయడంతో పాటు రోగుల నుంచి రక్తనమునాలు సేకరించి వైరాలజీ ల్యాబ్‌లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తామని' జీఎంసీ మైక్రోబయాలజీ హెచ్‌వోడీ డాక్టర్ జయలక్ష్మీ మంగళవారం ఆంధ్రజ్యోతికి తెలిపారు.

14వ తేదీ వరకు సెలవులోకి కలెక్టర్

గుంటూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఈ నెల 5వ తేదీ నుంచి సెలవుపై వెళ్లనున్నారు. గ్రీస్, టర్కీ దేశాలకు కుటుంబ సభ్యులతో కలిసి వ్యక్తిగత కారణాలతో పర్యటనకు వెళ్లేందుకు ఫిబ్రవరి 14వ తేదీనే రాష్ట్ర ప్రభుత్వ సాదారణ పరిపాలన శాఖ అనుమతించింది. ఈ నెల 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు కలెక్టర్ నాగలక్ష్మి అందుబాటులో ఉండరు. ఈ నేపథ్యంలో అప్పటివరకు ఇన్‌చార్జ్ బాధ్యతలను జాయింట్ కలెక్టర్ అమిలినేని భార్గవతేజ నిర్వర్తిస్తారని ప్రభుత్వం పేర్కొన్నది.



ఐకానిక్ మారిస్తే.. సమస్యే

(5వ పేజీ తరువాయి)

చర్చనీయాంశమైంది. ప్రస్తుతం రాయపూడి- మూలపాడు మధ్య నిర్మించేందుకు డీపీఆర్ తయారీ కోసం కన్సల్టెంట్లను ఆహ్వానిస్తూ ఏడీసీఎల్ తాజాగా ఓ నోటిఫికేషన్‌ను వెలువరించింది. అంటే ఐకానిక్ బ్రిడ్జిని గతంలో అనుకున్న స్థానంలో కాకుండా మరికొంచెం ఎగువన నిర్మించాలన్న ఆలోచనతో ఏడీసీఎల్ ఉన్నట్లు తెలు స్తోంది. అమరావతికి అవుటర్ రింగురోడ్డు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ ఓఆర్ఆర్ తాలూకు కృష్ణానదిపై ఓ వంతెన రాబోతుంది. ఇది వైకుంఠపురం వద్ద ప్రస్తుతం బ్యారేజి కమ్ బ్రిడ్జి నిర్మించాలనుకుంటున్న ప్రాంతానికి సుమారు రెండు కిలోమీటర్ల ముందు వస్తుంది. వైకుంఠపురం బ్యారేజిని ప్రభుత్వం ప్రకాశం బ్యారేజి మాదిరి బ్యారేజి కమ్ బ్రిడ్జిగా నిర్మించాలని భావిస్తుంది. అంటే ఆ ప్రాంతంలో కృష్ణానదిపై రెండు రోడ్డు బ్రిడ్జిలు అనివార్యంగా రాబోతున్నాయన్నమాట. ఈ రెండు బ్రిడ్జిల మధ్య నుంచి మళ్లీ ఎర్రుపాలెం-నంబూరు మధ్య అమరావతి రైల్వేలైను వస్తుంది. అంటే వైకుంఠపురం బ్యారేజి కమ్ బ్రిడ్జికి ముందు అమరావతి రైల్వేలైను దానికి ముందు ఓఆర్ఆర్ వంతెన వస్తాయి. ఇక ప్రస్తుతం ఏడీసీఎల్ కొత్తగా ప్రతిపాదించిన ఐకానిక్ బ్రిడ్జి రాయపూడి, మూలపాడు మధ్య నిర్మాణం జరిగితే భవిష్యత్‌లో నిర్మించాలనుకుంటున్న అంతర వలయ రహదారికి ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతానికి కేంద్రం ఐఆర్ఆర్ ప్రతిపాదనను త్రోసిపుచ్చినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం అమరావతికి భావి అవసరాల నిమిత్తం ఐఆర్ఆర్ తప్పనిసరని గట్టిగా వాదిస్తున్నారు. అవసరమైతే దానిని పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ విధానంతో చేపడతామన్న సంకేతాలను కూడా ఇస్తున్నారు.

పెరగనున్న నిర్మాణ వ్యయం

అమరావతికి ఐఆర్ఆర్ కావాలంటే ఏడీసీఎల్ ప్రస్తుతం ప్రతిపాదించిన ఐకానిక్ బ్రిడ్జిని రాయపూడి-మూలపాడు మధ్య కాకుండా గతంలో మాదిరి రాయపూడి-ఫెర్రీ మధ్యే నిర్మించాలి. ఎందుకంటే దీనిని రాయపూడి-మూలపాడు మధ్య నిర్మిస్తే ఐఆర్ఆర్ తాలూకు రోడ్డు కృష్ణానదిని దాటేందుకు ఈ ఐకానిక్ బ్రిడ్జి అవరోధంగా మారడమో లేక దానికి అతిసమీపంగా రావడమో జరుగుతుంది. దీనివల్ల ఎన్టీఆర్ జిల్లా వైపు కృష్ణానదిపై వంతెనలు దగ్గరదగ్గరగా ఉన్నట్లు అనిపిస్తుంది. క్షేత్రస్థాయి పరిస్థితులను గమనంలో ఉంచుకుంటే అక్కడ ఐఆర్ఆర్ వంతెన గుంటూరు జిల్లా వైపు బోరుపాలెం, ఎన్టీఆర్ జిల్లా వైపు మూలపాడు మధ్య వస్తుంది. ఈ కొత్త ప్రతిపాదిత ఐకానిక్ బ్రిడ్జి రాయపూడి వద్ద ఎన్ 13 రోడ్డు- మూలపాడు మధ్య 5.2 కిలోమీటర్లు వస్తుంది. యథావిధిగా ఐకానిక్ బ్రిడ్జి ఇటు రాయపూడి అటు ఫెర్రీ మధ్య నిర్మిస్తే అది 3.2 కిలోమీటర్లు మాత్రమే వస్తుంది. ఇది అమరావతి వైపు ఎన్-10 రోడ్డును ఫెర్రీ వద్ద పవిత్ర సంగమాన్ని అనుసంధానిస్తుంది. నిజానికి ఐఆర్ఆర్ వద్దనుకుంటే తప్ప ఐకానిక్ బ్రిడ్జి పాత ఎలైన్‌మెంట్‌ను మార్చరాదన్న సంగతిని ఇక్కడ గమనించాలి. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఐకానిక్ బ్రిడ్జి ఎలైన్‌మెంట్‌ను మార్చే విషయమై పరిశీలించాలని పలువురు కోరుతున్నారు.

కృష్ణానదిపై అరడజను వంతెనలు

రాజధాని అమరావతి నిర్మాణంతో ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల నడుమ కృష్ణానదిపై అరడజనుకు పైగా వంతెనలు రాబోతున్నాయి. ప్రకాశం బ్యారేజికి ఎగువన ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న విజయవాడ పశ్చిమ బైపాస్ వంతెన(ఆరు లేన్ల) వెంకటపాలెం-గొల్లపూడి మధ్య వస్తుంది. దీనికి పై వైపున గతంలో అమరావతికి గేట్‌వేగా ఐకానిక్ బ్రిడ్జిని రాయపూడి-ఫెర్రీ మధ్య నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. ఈ బ్రిడ్జి వల్ల ఎన్టీఆర్ జిల్లా వైపు హైదరాబాద్ హైవేతోపాటు జగదల్‌పూర్ హైవేను కూడా అమరావతికి అనుసంధానం చేసినట్లవుతుందని ప్రకటించారు. కానీ ప్రస్తుతం ఏడీసీఎల్ దీనిని గుంటూరు జిల్లా వైపు రాయపూడి నుంచే ప్రారంభిస్తున్నా ఎన్టీఆర్ జిల్లా వైపు మాత్రం కొంచెం ఎగువకు వెళ్లి మూలపాడు వద్ద కలిసేలా కొత్త ప్రతిపాదన చేసింది. దీని వల్ల జగదల్పూర్ హైవేతో అనుసంధానం తప్పడంతోపాటు కృష్ణానదిపై ఇంకా ఎగువన నిర్మించాలనుకుంటున్న బ్రిడ్జిల నిర్మాణంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది.

పఠనం.. ప్రోత్సాహం

◆ అందుబాటులో డిజిటల్ పుస్తకాలు
◆ పుస్తక పఠనంతోనే బాలల్లో సంపూర్ణ పరిపక్వత
◆ నేడు ప్రపంచ బాలల పుస్తక దినోత్సవం

గుంటూరు (విద్య), ఏప్రిల్ 1 (ఆంధ్ర జ్యోతి): ఆధునిక యుగంలో... శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న వినూత్న మార్పుల కారణంగా... కుటుంబాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రతి ఇంట్లో స్మార్ట్ ఫోన్లు, స్మార్ట్ టీవీలు ఇతర సాంకేతిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో బాలల్లో పుస్తక పఠనం క్రమంగా సన్నగిల్లుతోంది. అయితే వారి కోసం ప్రచురించే పుస్తకాల ముద్రణ మాత్రం ఆగడం లేదు. పుస్తకాలను డిజిటల్ రూపంలో ముద్రించి అందుబాటులోకి తీసుకు వస్తున్నారు. బుధవారం అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం...

గ్రంథాలయాల ఆధ్వర్యంలో...

బాలల్లో పుస్తక పఠనం పాఠ్యపుస్తకాలికే పరిమితం కాకుండా వారు కథల పుస్తకాలను చదివేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం ఏటా నిర్వహించే గ్రంథాలయ దినోత్సవాన్ని పురస్కరించుకుని దాదాపు నెల రోజులపాటు విద్యార్థుల్లో పుస్తక పఠనం పెంపొందించేందుకు వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు వారికి కొత్త పుస్తకాలు అందుబాటులోకి తీసుకువచ్చి చదివించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఆంగ్లం, తెలుగు మాధ్యమాల్లో పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి.



డిజిటల్ రూపంలోనూ...

పుస్తకాలు డిజిటల్ రూపంలోనూ అందుబాటులోకి వచ్చాయి. పంచతంత్ర కథలు, చందమామ కథలు, అక్బర్ బీర్బల్, తెనాలి రామకృష్ణ, అరేబియన్ నైట్స్ పేరుతో కథల పుస్తకాలు డిజిటల్ రూపంలో బాల లకు అందు బాటులో ఉన్నాయి. జిల్లా కేంద్ర గ్రంథా లయాల్లో కూడా డిజిటల్ పుస్తకాలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా కంప్యూటర్లు కూడా అక్కడ ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఏటా నిర్వహించే పుస్తక మహోత్సవాలు బాలల్లో పుస్తక పఠనాన్ని పెంపొందించేలా ప్రోత్సహిస్తున్నారు. ప్రత్యేక పోటీలు నిర్వహించి బాలల్లో పుస్తక పఠనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు.

బాలల్లో కథల పట్ల ఆసక్తి పెంపొందించాలి



బాలల్లో కథల పట్ల, దేశనాయకుల పట్ల ఆసక్తి పెంపొందించడానికి పుస్తక పఠనం దోహదం చేస్తుంది. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపి విద్యార్థుల్లో పుస్తక పఠనం పెంపొందించేలా కృషి చేయాలి. జ్ఞానం, విజ్ఞానం, లోకజ్ఞానం, ఉల్లాసం ఉత్సాహం, వినోదం ఇలా ఎన్నో విభాగాలు బాలల సాహిత్యలో ఉన్నాయి.

-కొండా శివరామిరెడ్డి, బుక్ లవర్స్ అధినేత

నేడు నూతక్కిలో పర్యటించనున్న కేరళ బృందం

గుంటూరు సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించేందుకు కేరళ బృందం రానున్నట్లు రైతు సాధికార సంస్థ ప్రతినిధులు తెలియజేశారు. బుధవారం గుంటూరు జిల్లాలోని నూతక్కి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన అరటి తోటలను ఈ బృందం పరిశీలించనున్నట్లు తెలిపారు. బృందంలో కేరళ వ్యవసాయ శాఖ మంత్రి పి.ప్రసాద్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్ వెంకట్రామన్, అడిషనల్ డైరెక్టర్ థామస్ శామ్యూల్ తదితర అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

ఆప్కాస్ రద్దు చేయొద్దంటూ నిరసన

మంగళగిరి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేయరాదంటూ సీఐటీయూ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కార్మికులు నిరసన తెలియజేశారు. పట్టణంలోని ఇందిరా నగర్, గాలిగోపురం సెంటర్లలో నిరసన తెలిపి, ఆప్కాస్ రద్దు చేయొద్దంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు కే ఏసు, కే ఆంజనేయులు, కే సునీత, జే రత్న, ఈ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సుఖమంచి గిరికి పలువురి అభినందనలు

మంగళగిరి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడిగా నియమితులైన సుఖమంచి గిరిబాబును పలువురు నేతలు మంగళవారం కలిసి అభినందనలు తెలియజేశారు. టీడీపీ నేతలు కొత్తపల్లి శ్రీనివాసరావు, విన్నకోట శ్రీనివాసరావు, రంగిశెట్టి నరేంద్ర, తాడిగిరి సుధీర్, బోగి వినోద్, రంగిశెట్టి పెద్దబ్బాయ్, షేక్ ఇంతియాజ్, చీకుల వెంకటేశ్వరరావు తదితరులు గిరికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. నేతలు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం గిరిబాబును అనేక ప్రలోభాలకు గురిచేసినప్పటికీ టీడీపీ పక్షానే నిలిచి పార్టీ గెలుపు కోసం కృషి చేశారని చెప్పారు. గిరిబాబుకు శివాలయం ట్రస్టుబోర్డు సభ్యుడిగా అవకాశం కల్పించిన మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

119వ రోజుకు చేరిన ఫ్యాక్టరీ కార్మికుల దీక్షలు

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కోర్టు తీర్పుల ప్రకారం తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం తాడేపల్లి ఏసిసి సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు మంగళవారం నాటికి 119వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో వై రమాదేవి, ఇమాంబీ, శారమ్మ, రమణ, విజయలక్ష్మి కూర్చున్నారు. దీక్షలను సీఐటీయూ నేత వేముల దుర్గారావు, యూనియన్ నేతలు కూరపాటి స్టీవెన్, కొర్రపాటి ఆదినారాయణ ప్రారంభించారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లనే సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యెహోషువ, హగ్గయ్య, ఇశ్రాయేలు, ఇస్మాయేలు, సుభాని, అంకయ్య, దుర్గాభవాని, సువర్ణలాదేవి, రిబ్కా, లక్ష్మీ, రమణ తదితరులు పాల్గొన్నారు.

నులకపేటలో విజిబుల్ పోలీసింగ్



నులకపేటలో స్థానికులతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ రవికుమార్

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేటలో మంగళవారం లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ స్థానికులతో మాట్లాడి పలు సమస్యలు తెలుసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలు, జరిగినా అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా పోలీసులకు తెలియజేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ కళ్యాణరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ



ప్రవీణ్ మృతిపై శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న చర్చి పాస్టర్లు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని చర్చి పాస్టర్లతో ప్రత్తిపాడులో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఇటీవల మరణించిన పగడాల ప్రవీణ్ మృతిపై పూర్తి స్థాయిలో విచారణ జరగాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రత్తిపాడు బస్టాండ్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కరుణకుమార్‌కు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని పాస్టర్లు పాల్గొన్నారు.

పూర్తయిన పింఛన్‌ల పంపిణీ



వితంతువుకు పింఛన్ అందజేస్తున్న సర్పంచ్

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో మంగళవారం తెల్లవారు జామున ఆయా గ్రామాల పంచాయతీ సెక్రటరీలు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి లబ్ధిదారుల ఇళ్ళకు వెళ్ళి నగదును పంపిణీ చేశారు. అలాగే నూతనంగా మంజూరైన వితంతు, దివ్యాంగుల తదితర లబ్ధిదారులకు పింఛను నగదుతో పాటు పండ్లు పంపిణీ చేశారు.

రాజధాని గ్రామాల్లో పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పిస్తాం

● పింఛన్ పంపిణీలో ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్



వెలగపూడిలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తుళ్లూరు, (మల్కాపురం, వెలగపూడి) ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం నెరవేర్చుతుందని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాజధాని గ్రామాలైన మల్కాపురం, వెలగపూడిలో జరిగిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రెండు గ్రామాల్లో పర్యటించి చేపట్టవల్సిన మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. మల్కాపురంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవటంపై పంచాయతీ సెక్రటరిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. మురుగు కాల్వల్లో కొబ్బరి బొండాలు పడేయటంతో మురుగు నిలిచిపోవటాన్ని ఎమ్మెల్యే పరిశీలించి వెంటనే శుభ్రం చేయాలని ఆదేశించారు. రోడ్డు వెంట అపరిశుభ్రంగా ఉన్న చెరువును పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వెలగపూడిలో చివరి బజారుకు నీళ్లు అందటం లేదని ఫిర్యాదు చేశారు. సంపూర్ణంగా నీళ్లు అందేవాళ్లు కుళాయిలు కట్టేయకుండా ఉండటంతో చివర వారికి తాగునీటి సరఫరా మందగించిందని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ వెలగపూడిలో ఏర్పాటు చేసిన గ్రామస్తుల సమావేశంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందన్నారు. రోడ్ల సంగతి ప్రజలందరూ చూశారని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రం మొత్తం గోతుల రోడ్లను వేసినట్టు చెప్పారు. రాజధాని నిర్మాణ పనులకు టెండర్లు పూర్తి కావచ్చి కంపెనీలు ఆయా పనులు చేసుకోవడానికి సన్నాహాలు చేసుకుంటున్నట్టు చెప్పారు. రాజధాని గ్రామాల్లో పూర్తి మౌలిక వసతులు కల్పిస్తామని అన్నారు. అమరావతి జీవనభృతితో పాటు సామాజిక పింఛన్లు ప్రతి నెల మొదటి తారీఖున ఉదయం 7గంటలకు అధికారులు ఇళ్ల ముందుకు వచ్చి అందజేస్తున్నారని తెలిపారు. కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొని పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పండుగలా చేయాలని సూచించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తాడికొండ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య, మండల జనసేన అధ్యక్షుడు యర్రగోపు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



పశువుల తొట్టె నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న బూర్ల రామాంజనేయులు, పాల్గొన్న డ్వామా పీడీ శంకర్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి, జిల్లాని అగ్రపథంలో నిలపాలని ప్రత్తిపాడు, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామంలో మంగళవారం పశువుల తొట్టె నిర్మాణానికి భూమి పూజ, అనంతరం గ్రామంలో రూ.10 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును పరిశీలించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ప్రకటించిన పంచ ప్రాధాన్యాలు కార్యక్రమం విజయవంతం చేయాలని అన్నారు. ఉపాధి పథకంలో జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.89 కోట్ల 28 లక్షలతో వివిధ పనులు చేపట్టారన్నారు. ఇందులో 17.16 కిలోమీటర్లు సీసీ రోడ్లు, 4.00 గ్రావెల్ రోడ్లు, 383 పశువుల కొట్టాలు, 113 పంట కుంటలు, 1203 ఇంకుడు గుంతలు ఉన్నాయని అన్నారు. కేటాయించిన పనులను జూన్ 30లోపు పూర్తి చేయాలన్నారు. డ్వామా పీడీ శంకర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు దారులకు సరిపడా పనులను కేటాయించేందుకు లాగిన్‌లోని షెల్ఫ్‌లో పనులను సిద్ధంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. వేసవి దృష్ట్యా ఉదయం 5.30 నుంచి 10.30 గంటలకు మధ్యలో పనికి హాజరయ్యేలా చూడాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు. ప్రథమ చికిత్స కిట్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీసీఈవో జ్యోతి బసు, పశు సంవర్ధకశాఖ జేడీ జీ నరసింహారావు, ఆర్డీవో కే శ్రీనివాసరావు, డీపీవో నాగసాయికుమార్, తూర్పు తహసీల్దారు సుబాని, ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆహ్వాన సంఘం కరపత్రాల ఆవిష్కరణ

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20, 21 తేదీలలో ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో జరుగుతున్న రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం తాడేపల్లిలో ఆహ్వాన సంఘం కరపత్రాలను ఆవిష్కరించారు. తాడేపల్లి చిట్యాల ఐలమ్మ రజక కళ్యాణ మండపంలో పాగోలు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి బొజ్జా సుబ్బారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రజకవృత్తి అంతరించి పోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో అనేక మంది వృత్తిదారులు అపార్టుమెంట్ వాచ్‌మన్ కమ్ ఇస్త్రీ వృత్తిగా జీవనం సాగిస్తున్నారని చెప్పారు. పాగోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ 50 సంవత్సరాలు నిండిన ప్రతి వృత్తిదారుడికి పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శ్రీనివాసరావు, యానాదిరావు, నరసింహారావు, సాంబశివరావు, వీరాంజనేయులు, వరప్రసాద్, బాబూరావు, బాలకృష్ణ రాము తదితరులు పాల్గొన్నారు.

దేశంలో పెరిగిపోతున్న పేదరికం, నిరుద్యోగం

● ముప్పాళ్ల నాగేశ్వరరావు



ర్యాలీలో పాల్గొన్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ శ్రేణులు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని, దేశంలో మతోన్మాదం, పేదరికం, నిరుద్యోగం నానాటికీ పెరిగిపోతున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఈ నెల 23న భగత్‌సింగ్ వర్ధంతి నుంచి ఏప్రిల్ 14న అంబేడ్కర్ వర్ధంతి వరకు మోదీ పాలనకు వ్యతిరేకంగా జరుగనున్న ప్రచార కార్యక్రమాన్ని మంగళగిరి కొత్తపేటలో మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ ప్రధాని మోదీ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి నిరుద్యోగ యువతను దారుణంగా మోసం చేశారన్నారు. మోదీ, అమిత్‌షాలు విచ్ఛిన్నకర శక్తులుగా తయారై మతోన్మాదాన్ని పెంచిపోషిస్తున్నారని ధ్వజమెత్తారు. ఢిల్లీలో రైతు ఉద్యమం సందర్భంగా అనేక హామీలు ఇచ్చి, మళ్లీ అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేయకుండా రైతులను నట్టేటా ముంచారని విమర్శించారు. ప్రాంతీయ పార్టీలు మోదీ నియంతృత్వానికి భయపడి ఆయన్ను నెత్తిన పెట్టుకుని మోస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, నేతలు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, నందం బ్రహ్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నివేశన స్థలాలు మంజూరు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలో పాల్గొని, వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

దుగ్గిరాల, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలగ్రామాల్లో ఇళ్లులేని పేదలకు నివేశన స్థలాలు మంజూరు చేయాలని, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, తదితర సమస్యలపై సీపీఎం నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీపీఎం జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు ఈమని అప్పారావు మాట్లాడుతూ గ్రామాల్లోని పేదలకు గత ప్రభుత్వం ఇచ్చిన నివేశనస్థలాలు గ్రామాలకు దూరంగా నివాసయోగ్యంగా లేవని, మౌలిక వసతులు లేకపోవడంతో ప్రజలు ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు రాలేదన్నారు. మండలగ్రామాల్లో ప్రజా చైతన్యయాత్ర నిర్వహించి, వారి సమస్యలను ప్రభుత్వాధికారుల దృష్టికి తీసుకు వచ్చినట్టు తెలిపారు. డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో దోమల బెడద అధికమై ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారన్నారు. ఏమినేని స్టాలిన్ మాట్లాడుతూ, లంకగ్రామాల్లో భూములు కలిగిన రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల సమస్యను తక్షణమే పరిష్కరించాలన్నారు. జెట్టి బాలరాజు మాట్లాడుతూ బెల్టుషాపులను నియంత్రించి, కల్లుగీత కార్మికులకు అన్యాయం జరుగకుండా చూడాలన్నారు. ధర్నా అనంతరం తహసీల్దార్ ఐ. సునీతకు వినతిపత్రం అందించారు. సీపీఎం నాయకులు మన్నవ నాగ మల్లేశ్వరరావు, గొర్రిపాటి శ్రీనివాసరావు, అద్దంకి పాములు, శేషగిరి, దాసరి విజయలక్ష్మి తదితరులున్నారు.

ముగిసిన అంతర్జాతీయ ఈసీఈ విభాగం సదస్సు



ఈసీఈ విద్యార్థులు ఆచార్యులతో సుమన్ తదితరులు

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటిలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు మంగళవారం ఘనంగా ముగిసింది. పర్యావరణ హితమైన పరిజ్ఞానంతో భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుందని సాంకేతిక పరిజ్ఞానంలో స్థిరమైన పురోగతి సాధిస్తున్నట్టు ఇటలీలోని యూనివర్సిటి ఆఫ్ బ్రెసియ ప్రతినిధి మోను బైతా ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు రకాల నూతన ఆవిష్కరణల గురించి వివరిస్తూ వ్యర్థాలను, కాలుష్యాన్ని తగ్గించడం ద్వారా వాతావరణ తాపాన్ని నివారించడం వంటి లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సదస్సుకు చైనా, తైవాన్, ఇటలీ, ఇండియాలోని ఐఐటీ, ఐఐఐటీ, ఎన్ఐటీల నుంచి 176 మంది ప్రతినిధులు హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో బెంగళూరు ఇస్రో శాస్త్రవేత్తలు రాజా, శ్రీధర్, ఆర్ అండ్‌డీ డైరెక్టర్ బీటీపీ మాధవ్, సలహాదారు డాక్టర్ సంతోష్, వీసీ సారధివర్మ, ప్రోవీసీలు ప్రసాద్, వెంకట్రామ్, రాజశేఖర్, రిజిస్ట్రార్ సుబ్బారావు, డీన్ ప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి నిడుముక్కలలో 73వ ఉరుసు మహోత్సవం

తాడికొండ(నిడుముక్కల), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని నిడుముక్కల గ్రామంలో 101 దర్గాలు ఉన్న హజరత్ సయ్యద్ బాజి షహిద్ సర్కార్ అవులియా బాబా 73వ ఉరుసు మహోత్సవం జరుగుతుందని దర్గ ముజపర్, ముతవల్లి షేక్ షబ్బీర్ బాషా తాజ్‌వుల్ ఖాద్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2వ తేదీ బుధవారం గుసూల్, చందనం పూయుట, 3వ తేదీ గురువారం గంధం కార్యక్రమంలో, రాత్రి 8 గంటలకు అన్న సంతర్పణ కార్యక్రమం, 4వ తేదీ శుక్రవారం దీపారాధన నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని ప్రముఖులు, రాజకీయ నాయకులు పాల్గొంటారని తెలిపారు. భక్తులు పాల్గొని ఉరుసు మహోత్సవాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు తెలియజేశారు.

ఉత్తమ లఘు చిత్రాలకు అవార్డులు



కేఎల్‌యూ విద్యార్థి అఖిల్‌సాయికి ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు అందజేస్తున్న డాక్టర్ సుభాష్ యలవర్తి తదితరులు

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటిలో జరిగిన సినీఫీలియా 2025 జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించిన ఉత్తమ లఘు చిత్రాలకు మంగళవారం వర్సిటిలోని లలిత కళల విభాగంలోని స్టూడియోలో పురస్కరాల విభాగాధిపతి సుభాష్ యలవర్తి తదితరులు విజేతలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిల్మ్ మేకింగ్, ఫొటోగ్రఫీ, ప్రొడక్షన్ డిజైన్‌లలో విద్యార్థులు ప్రతిభను చాటిచెప్పే ఉత్సాహభరితమైన వేదిక జాతీయ స్థాయి ఫిల్మ్ ఫెస్టివల్‌ను కేఎల్‌యూ లలిత కళల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా కేఎల్‌యూ ఉద్యోగాల కల్పన డీన్ ఎస్‌టీవీ ప్రసాద్ స్టూడెంట్ మ్యాగజైన్ కాన్వాస్ 2025ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వీసీ సారధివర్మ ప్రోవీసీలు ప్రసాద్, వెంకట్రామ్, రాజశేఖర్, రిజిస్ట్రార్ సుబ్బారావు, డీన్ కేఆర్ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తుళ్లూరు సీఐగా కొంకా శ్రీనివాసరావు

గుంటూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : తుళ్లూరు సీఐగా కొంకా శ్రీనివాసరావును ఎటాచ్‌మెంట్‌పై నియమిస్తూ మంగళవారం రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు తుళ్లూరు సీఐగా విధులు నిర్వహించిన గంగా వెంకటేశ్వర్లును ఇటీవల పట్టాభిపురం సీఐగా నియమించిన విషయం విదితమే. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న తుళ్లూరు సీఐ పోస్టును కొంకా శ్రీనివాసరావుతో భర్తీ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అరండల్‌పేట సీఐగా కొంకా శ్రీనివాసరావు విధులు నిర్వహించారు. అయితే అప్పట్లో పోలీస్‌స్టేషన్‌లో కస్టడీలో ఉన్న బోరుగడ్డ అనిల్‌కు రాచమర్యాదలు జరిగినట్టు ఆరోపణలు రావటంతో సీఐ శ్రీనివాసరావును వీఆర్‌కు పంపగా వెస్టు డీఎస్పీ జయరాంప్రసాద్‌ను బదిలీ చేశారు. అలాగే నలుగురు పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి వీఆర్‌లో ఉన్న శ్రీనివాసరావు నరసరావుపేటలోని సాయిసాధన చిట్‌ఫండ్స్ కేసుకు సంబంధించి నియమించిన సిట్ బృందంలో ఉన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న కమిషనర్ అలీం బాషా, సిబ్బంది

మంగళగిరి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను మంగళవారం పంపిణీ చేశారు. ఎంటీఎంసీ పరిధిలో పింఛన్ల పంపిణీని కమిషనర్ అలీం బాషా ప్రారంభించారు. అధికారులు, సిబ్బంది, కూటమి నేతలు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్మును అందజేశారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మహాప్రస్థానం వాహనం పునః ప్రారంభం

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ అండ్ కేవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, గుంటూరు టెలికం మెంబర్ కళ్ళం రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణంలో ఎన్నో ఏళ్లగా వైఎస్సార్ అండ్ కేవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా మహా ప్రస్థానం వాహనం కొన్ని అనివార్య కారణాల వల్ల ఆగిపోయింది. దీంతో పట్టణ ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన రాజశేఖర్‌రెడ్డి మరలా అందుబాటులోకి తీసుకురావాలనే ఆలోచనతో రూ.5లక్షలు వెచ్చించి వాహనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ వాహనాన్ని మంగళవారం పట్టణ వైసీపీ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.

ఆంధ్రజ్యోతి

దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

సంప్రదించండి 98484 11050 99854 03281

పవర్ లిఫ్టర్లకు ఉగాది పురస్కారాలు



సాదియాకు ఉగాది పురస్కారం అందజేస్తున్న గ్లోబల్ సంస్థ ప్రతినిధులు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులకు గుంటూరుకు చెందిన గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలను అందజేశారు. మంగళగిరికి చెందిన అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ సాదియా అల్‌మాస్, జాతీయ మాస్టర్స్-2 క్రీడాకారిణి జ్యోతి వర్మ, పవర్ లిఫ్టింగ్ అండ్ వెయిట్ లిఫ్టింగ్ కోచ్‌లు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సందానిలకు ఉగాది క్రీడా పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు. పురస్కారాలు అందుకున్న క్రీడాకారులు, కోచ్‌లను పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సకల కోటేశ్వరరావు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మద్ది ప్రభాకర్, అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, జిల్లా వైస్‌చైర్మన్ ఆర్ఎస్ వంశీకృష్ణ, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

కుంచనపల్లిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ



కుంచనపల్లిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తున్న అమరా సుబ్బారావు

తాడేపల్లి (కుంచనపల్లి), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం అన్ని పంచాయతీల్లో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఉదయం నుంచే ప్రారంభమైంది. కుంచనపల్లి గ్రామ సచివాలయ సిబ్బంది కూటమి నేతలు కలిసి టీడీపీ మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు నేతృత్వంలో పింఛన్లు పంపిణీ చేశారు. సుబ్బారావు మాట్లాడుతూ లబ్ధిదారులు అందరూ ఆర్థిక భద్రతతో ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ప్రజాశ్రేయస్సే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో కుంచనపల్లి గ్రామ జనసేన పార్టీ అధ్యక్షుడు మేకల రాజా, బిరుదుగడ్డ రమేష్, దాసెట్టి అరుణ, కోలంటి మహేష్, మహేంద్ర, తోటకూర ప్రవీణ్, మాణిక్యాలరావు, నాగరాజు, భరత్,రాజు టీడీపీ జనసేన నాయకులు పాల్గొన్నారు. కాగా తాడేపల్లి పట్టణంలో వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం నుంచే ఆయా వార్డుల్లో సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. ఉండవల్లిలో ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా అధికారులు పింఛన్ల పంపిణీ నిర్వహించారు.

ఉపాధిహామీ పనులను పరిశీలించిన ఎంపీపీ జబీన్



చిలువూరులో ఉపాధిహామీ పనులను ప్రారంభించి, పరిశీలిస్తున్న ఎంపీపీ జబీన్, స్థానిక టీడీపీ నాయకులు

దుగ్గిరాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను మండల పరిషత్ అధ్యక్షురాలు షేక్ జబీన్ మంగళవారం ప్రారంభించారు. మండల గ్రామం చిలువూరులో పంటకాల్వల పూడికతీతకోసం ఉపాధి హామీ కూలీలకు పని కల్పిస్తూ చేపట్టిన పనులను ఎంపీపీ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. పూడికతీత పనులను పరిశీలించిన ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి కూలీలకు రూ.307 చొప్పున చెల్లిస్తోందని, 100 రోజుల పనికల్పనకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శి ఎం శరత్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు తోటకూర సీతారామయ్య, మాజీ జడ్పీటీసీ యేళ్ల జయలక్ష్మి, సర్పంచ్ చిలువూరు మాణిక్యం, ఎంపీటీసీ రోజమరియమ్మ, శేషగిరి, ఏసుపాదం, పలువురు ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో పింఛన్ల పంపిణీ

దుగ్గిరాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని లబ్ధిదారులందరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. చిలువూరులో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ ప్రతినెలా ఒకటో తారీఖు ఉదయాన్నే పింఛన్‌లను పంపిణీ ప్రారంభమవుతోందని, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల పింఛన్‌లను సచివాలయ సిబ్బంది, లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్లి అందిస్తున్నారన్నారు. ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో మొత్తం 9108 మంది పింఛన్ దారులున్నారని, మధ్యాహ్నానికే 90శాతం పింఛన్‌ల పంపిణీ పూర్తయిందన్నారు. గ్రామ అధ్యక్షుడు తోటకూర సీతారామయ్య, మాజీ జడ్పీటీసీ యేళ్ల జయలక్ష్మి, ఈవోపీ ఆర్డీ జవహర్, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తాడికొండలో 92 శాతం పింఛన్ల పంపిణీ

తాడికొండ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లు తాడికొండ మండలంలో మంగళవారం సాయంత్రం నాటికి 92 శాతం పంపిణీ పూర్తయ్యిందని ఎంపీడీవో కే.సమతవాణి పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. బుధవారంతో పింఛన్ల పంపిణీ ముగుస్తుందని తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల్లో కూటమి నాయకులు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్లు పంపిణీ చేశారు.

ఉప్పుటూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం 10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఎన్ఆర్ఐ ఉప్పుటూరి రామ్‌చౌదరి సహకారంతో తన తండ్రి పేర నిర్వహిస్తున్న ఉప్పుటూరి చిన రాములు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వట్టిచెరుకూరు మండలంలోని పరీక్ష కేంద్రాలతో పాటు రూరల్ మండలంలో కూడా మజ్జిగ పంపిణీ చేశారు. మంగళవారం మండలంలోని గారపాడు హైస్కూల్‌లోని విద్యార్థులకు ఉప్పుటూరి చినరాములు స్వయంగా పాల్గొని విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుంటుపల్లి సదాశివరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఉప్పుటూరి చినరాములు

చికిత్స పొందుతూ కౌలురైతు మృతి

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతూ కౌలు రైతు మృతిచెందిన సంఘటనపై మంగళవారం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రూరల్ ఎస్ఐ గండు కిరణ్ కథనం ప్రకారం మండల పరిధిలోని వెల్లలూరు గ్రామానికి చెందిన వనుకూరు దశరధరామయ్య(35) మార్చి 23న అప్పుల బాధలతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. స్థానికులు దశరధరామయ్యను చికిత్స నిమిత్తం మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దశరధరామయ్య మంగళవారం మృతి చెందాడు. దీనిపై రూరల్ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి
99854 11227
99854 02292

నేడు బీసీ కార్పొరేషన్ లోన్ మేళా

● ఎంపీడీవో అత్తోట దీప్తి

తెనాలిరూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి బీసీ కార్పొరేషన్ ద్వారా లోన్‌మేళా నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో అత్తోట దీప్తి తెలిపారు. వివిధ బ్యాంకర్లు ఈ మేళాలో పాల్గొంటారని దరఖాస్తు చేసుకున్న వారు వచ్చి వారి వివరాలను తనిఖీ చేయించుకోవాలని కోరారు.

పినపాడులో గడ్డివాములు దగ్ధం

తెనాలి రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పినపాడులో గడ్డి వాములు దగ్ధమైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సుమారు 13మంది రైతులు 46ఎకరాల గడ్డివాములను నిల్వచేశారు. తెనాలి నుంచి అగ్నిమాపక సిబ్బంది రాత్రి వరకూ మంటలను అదుపుచేసేందుకు యత్నించారు. నష్టం వివరాలు తెలియరాలేదు.

కొల్లిపరలో పూరిల్లు, గడ్డివామి ..

కొల్లిపర, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తూములూరులో జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు, వరిగడ్డివామి దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో 2 లక్షల 35వేల రూపాయలు నష్టం వాటిల్లింది. వివరాల్లోకి వెళితే తూములూరులో సోమవారం అర్ధరాత్రి సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆళ్ళ నాగిరెడ్డి పూరిల్లు వద్ద మంటలురేగాయి. పక్కనున్న ఆరుమళ్ళ వెంకటరెడ్డికి చెందిన ఐదు ఎకరాల వరిగడ్డివామి దగ్ధమైంది. ఈ ప్రమాదంలో నాగిరెడ్డి కట్టుబట్టలతో మిగిలాడు. వెంకటరెడ్డి గడ్డివామి పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో 2లక్షల 35వేల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

ఏటీఎంల వద్ద దొంగతనానికి పాల్పడిన వ్యక్తి గుర్తింపు



నిందితుడు

తెనాలి క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంల వద్ద మాటు వేసి వృద్ధులను ఏమార్చి నగదు దోచుకుంటున్న దొంగను వన్‌టౌన్ పోలీసులు గుర్తించారు. వన్ టౌన్ సీఐ మల్లిఖార్జునరావు తెలిపిన వివరాల మేరకు ఇటీవల కొత్తపేట ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఏటీఎం వద్ద ఇటీవల 70 సంవత్సరాల రిటైర్డ్ ఉద్యోగి ఏటీఎం నుంచి నగదు తీసుకుంటుండగా అతని ఏటీఎం పిన్‌కోడ్ నెంబరు గుర్తుంచుకుని పెద్దయనా పక్కకు జరుగు అంటూ హడావుడి చేసి ఆ వృద్ధుడి కార్డు స్థానంలో మరో కార్డు అతని చేతిలో పెట్టాడు. అనంతరం ఆ వృద్ధుడు కార్డుతో వివిధ ప్రాంతాలలో ఏటీఏంల ద్వారా రూ.1.15 లక్షలు విత్‌డ్రా చేశాడు. బ్యాంకువారు అందించిన సీసీ ఫుటేజ్ ద్వారా నిందితుడిని గుర్తించి కేసు నమోదు చేశారు. అతని ఆచూకీ తెలిస్తే 9440796218 తెలియజేస్తే రూ.5వేలు రికార్డు అందించడం జరుగుతుందని సీఐ తెలిపారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రవచనం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రామలింగేశ్వరపేటలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం కాశీ మహోత్సవం అనే అంశంపై బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ ప్రవచనం చేశారు. శ్రీరామ నవమి ఉత్సవాలు పురస్కరించుకుని ఈ ప్రవచనాన్ని ఏర్పాటుచేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈవో హరి ప్రసాద్, ములుకుట్ల విశ్వనాథశర్మ, అంజనేయ చయనులు, రాఘవేంద్ర శివవరప్రసాద్, శైలజ, గోపాలకృష్ణ పాల్గొన్నారు. హనుమాన్ చౌక్‌లోని సీతారామ మందిరంలో జరుగుతున్న శ్రీరామ నవమి ఉత్సవాలలో భాగంగా ఆయన శ్రీరామ కర్ణామృతం అనే అంశంపై ప్రవచనం చేశారు. నారాయణ తీర్థుల తరంగాలను సంపత్‌కుమార్ వివరించారు. కమిటీ కార్యదర్శి కేవీ సూర్యనారాయణ మూర్తి, రత్నాకరశాస్త్రి, ఆంజనేయశాస్త్రి, నరసింహాచార్యులు పర్యవేక్షించారు.

నిల్వ ఆహారాలను తీసుకోకూడదు: మండల వైద్యాధికారి సుమంత్

కొల్లిపర, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవడం మంచిదికాదని మండల వైద్యాధికారి సుమంత్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తూములూరులో వైద్యాధికారులు ప్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్‌ఎల్ హెచ్‌పీ భారతి, ఎఎన్‌ఎమ్ లలితా, హెల్త్ అసిస్టెంట్ సుదర్శన్, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆషా కార్యకర్తలు వనలక్ష్మి, ప్రమీలా, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

బార్ అధ్యక్షుడికి ఘన సన్మానం

పొన్నూరు టౌన్, మార్చి, 1 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన షేక్ బాజీసాహెబ్‌ను మంగళవారం పండ్లు, కూరగాయల వ్యాపార వర్తక సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, వర్తక సంఘాల నాయకులు నజీర్, శ్రీనివాస్, పఠాన్ సుభానీ, టీడీపీ నాయకులు జానీబేగ్, ఖదీర్, పఠాన్ ఫయిజుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం

● జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



ఆలపాటి శివరామకృష్ణయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న రామానాయుడు, రామాంజనేయులు, బ్రహ్మానందరెడ్డి, ఆలపాటి రాజేంద్రప్రసాద్ దంపతులు

తెనాలి రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా నిలిచేది కూటమి ప్రభుత్వం మాత్రమేనని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. తెనాలి వ్యవసాయమార్కెట్ యార్డులో ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ ఎడ్ల బలప్రదర్శన, పశుపాల పోటీలకు నాలుగో రోజు మంగళవారం జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు ముఖ్య అతిథులుగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. తొలుత టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహానికి, దివంగత శివరామకృష్ణయ్య విగ్రహాలకు అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ఒంగోలు జాతి ఎద్దులకు రైతులకు విడదీయలేని బంధం ఉందన్నారు. ఎద్దులను రైతులు సొంత బిడ్డల్లా చూసుకునేవారని ప్రస్తుతం యాంత్రీకరణ పెరగడం, పోషణ ఖర్చులు కూడా భారంగా మారడంతో వాటి ఆదరణ తగ్గిందన్నారు. ప్రస్తుతం అంతరించిపోతున్న సంస్కృతి సాంప్రదాయాలను తిరిగి నిలబెట్టేలా తెనాలిలో ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ పేరుతో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు నేతృత్వంలో కమిటీల సహకారంతో జాతీయ స్థాయిలో నిర్వహించడం గొప్పవిషయమన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతుల పక్షపాతిగా ఉన్నామని చెప్పడం మినహా అన్నదాతలకు చేసిందేమీలేదని విమర్శించారు. రివర్స్ పాలనతో సాగుకు అవసరమైన నీటిని కూడా అందించేలేకపోయిందని ఆరోపించారు. వ్యవసాయానికి ప్రధాన భూమికైన ప్రాజెక్టుల నిర్వహణపై వైసీపీ ప్రభుత్వం కనీస బాధ్యత తీసుకోలేదని విమర్శించారు. లాకులు, షెట్టర్లకు కనీసం గ్రీజు కూడా పెట్టలేని దుర్మార్గపు ప్రభుత్వం వైసీపీదేనన్నారు. వైసీపీ హయాంలో పులిచింతల ప్రాజెక్టులో కనీస నిల్వ ఉంచలేదని, కూటమి ప్రభుత్వం సాగు, తాగు నీరందేలా పుష్కలంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్న ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ శరవేగంగా అమరావతి రాజధానిగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాన్ని ఒక్క అవకాశం అని అడిగి జగన్‌మోహన్‌రెడ్డి నిలువునా ముంచాడని ఆరోపించారు. గత పాలనకు ప్రజలు 11 సీట్లు ఇస్తే కనీసం శాసన సభకు కూడా రాలేని పరిస్థితుల్లో వైసీపీ ఉందన్నారు. నిర్వాహక కమిటీ సభ్యులు, పలువురు కూటమి నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కోదండ రామస్వామి ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్ తదితరులు

కోదండ రామాలయంలో ఎమ్మెల్యే పూజలు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని తెలగపాలెం కోదండరామాలయంలో మంగళవారం ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రత్యేక పూజలు చేశారు. కోదండరామాలయం ఏర్పాటై వెయ్యేళ్లు పూర్తయిన సందర్భంగా ఆలయ నిర్వాహకులు మహాకుంభాభిషేక ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో విష్వక్సేన పూజ, పంచగవ్యారాధన, వాస్తు పూజ నిర్వహించారు. అగ్ని మదనం చేసి వాస్తు హోమం నిర్వహించారు. సాయంత్రం ఆరాధన కుంభకళాన్యాసం, విశేష పూజలు జరిపారు. పూజల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యేకు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆలయ అర్చకులు సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు వేదాశీర్వచనాలు అందించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, కూటమి పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రమాద మృతులకు కన్నీటి వీడ్కోలు

● ఇంకా ఆసుపత్రిలోనే ఉన్న భార్యాభర్తలు

● మెరుగైన వైద్యసేవలందించాలని పెమ్మసాని ఆదేశం

● అండగా నిలుస్తామన్న మంత్రి మనోహర్



మృతదేహాలకు బంధువుల నివాళి



ఐదేళ్ల సాత్విక, రోజుల పసికందు మృతదేహాలు

తెనాలి, ఏప్రిల్ 01, (ఆంధ్రజ్యోతి): ఏ మోము చూసినా పుట్టెడు దుఃఖంతో నిండిపోతే, బంధువులే కాదు... బయటివారుకూడా బరువెక్కిన హృదయాలతో కన్నీరుమున్నీరయ్యారు. రోజుల పసికందు, మరో చిన్నారి దేహాలను చూసిన పరిసర ప్రాంతాల వారి హృదయం ద్రవించిపోయింది. సోమవారం కృష్ణా జిల్లా పులిగడ్డ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులతో సహా తెనాలికి చెందిన ఒకే కుటుంబంలోని నలుగురు మరణించిన విషయం తెలిసిందే. ఆ నలుగురు మృతదేహాలను మంగళవారం తెనాలి తీసుకురావటంతో ఆ కుంటుంబం ఇంటి దగ్గర దయనీయ పరిస్థితి నెలకొంది. తెనాలి చెంచుపేటకు చెందిన గిడుగు రవీంద్రమోహనబాబు కుమారుడికి నామకరణం చేయించేందుకు కుటుంబం మొత్తం కలసి కారులో సోమవారం మోపిదేవి ఆలయానికి వెళుతూ ప్రమాదానికి గురయ్యారు. పులిగడ్డ దగ్గర లారీని కారు ఢీకొనటంతో రవీంద్రమోహనబాబు, ఆయన భార్య అరుణ, మనుమరాలు సాత్విక, రోజుల పసికందుతో సహా నలుగురు మరణించారు. ఆయన కుమారుడు సందీప్, కోడలు పల్లవిలు మాత్రం తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇప్పటికీ వారికి తమ తల్లిదండ్రులు, ఇద్దరు సంతానం చనిపోయిన విషయం తెలియదు. చివరి చూపునకు కూడా వారు నోచుకోలేదంటూ బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. మంగళవారం నాలుగురిని, వారి బంధువులు, మిత్రులు, స్థానికులు భారీ సంఖ్యలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

అండగా ఉంటాం: పెమ్మసాని

కృష్ణా జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెనాలికి చెందిన కుటుంబంలోనివారు మరణించటంతో ఢిల్లీలో ఉన్న కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్‌ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కుటుంబానికి సంతాపాన్ని ప్రకటించారు. రవీంద్ర మోహనబాబు కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి పరామర్శించారు. మీకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అన్నివిధాలా అదుకుంటామని వారికి భరోసానిచ్చారు. అయితే ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సందీప్, పల్లవిలకు మెరుగైన వైద్యం అందిచాలని ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడానని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మంత్రి మనోహర్ తీవ్ర దిగ్భ్రాంతి

రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబంలో నలుగురు మరణించటం, అందులోనూ ఇద్దరు చిన్నారులు ఉంటే, వారిలో పుట్టి నెలకూడా నిండని పసికందుకూడా ఉండటంతో తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తుందని, అవసరమైన సాయాన్ని అందిస్తామని పేర్కొన్నారు. గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సందీప్, పల్లవిల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నామని, మెరుగైన వైద్యం అందించేలా చూస్తున్నట్టు, ఆసుత్రి వర్గాలతో మాట్లాడి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్టు మనోహర్ తెలిపారు.

కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్త షేక్ ఫిరోజ్ మృతి పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. పట్టణంలోని 27వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త నరేంద్రకుమార్ వీరాభిమాని షేక్ ఫిరోజ్ ఇటీవల మృతిచెందారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మంగళవారం ఫిరోజ్ గృహానికి వెళ్లి ఆయన మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. నరేంద్రతో పాటు ముస్లిం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే జరిమానా

● మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు



టీస్టాల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న కమిషనర్ రమేష్‌బాబు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే జరిమానా విధిస్తామని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు హెచ్చరించారు. పురపాలక సంఘం పరిధిలోని పలు దుకాణాల్లో మంగళవారం కమిషనర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని గుర్తించి ఓ దుకాణ యజమానికి రు.2వేలు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రజా ఆరోగ్యానికి పెను ముప్పుగా మారిన ప్లాస్టిక్‌ను నిషేధించామన్నారు. దీనిపై పెద్దఎత్తున ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. అయినప్పటికీ కొందరు వ్యాపారులు నిషేధిత కవర్లను వినియోగించడం తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. మొదటిసారి పట్టుబడితే అపరాధ రుసుం విధిస్తామని, రెండోసారి కూడా నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తూ దొరికితే దుకాణ అనుమతులు రద్దు చేయనున్నట్లు కమిషనర్ రమేష్‌బాబు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతరించిపోతున్న కళలను భావితరాలకు అందించాలి

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్



ఎన్టీఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును రంగస్థల నటి విజయలక్ష్మికి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి, తదితరులు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న కళలను కాపాడి భావి తరాలకు అందించాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో మంగళవారం డీఎల్ కాంతారావు పోస్టల్ ఉద్యోగుల కళా పరిషత్ రెండు రోజుల నాటకోత్సవాలను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. పరిషత్ ఆధ్వర్యంలో ఇస్తున్న ఎన్టీఆర్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రముఖ రంగస్థల నటి, రచయిత్రి కె.విజయలక్ష్మికి ప్రదానం చేశారు. పరిషత్ గౌరవాధ్యక్షుడు నాయుడు గోపి అధ్యక్షతన జరిగిన సభలో ఆలపాటి మాట్లాడుతూ, ఎంతోమంది కళాభిమానులు, దాతలు రంగస్థలానికి చేయూత అందిస్తూ ప్రోత్సహిస్తున్నారని అభినందించారు. తపాలా శాఖలో చిన్న ఉద్యోగిగా ప్రవేశించిన డీఎల్ కాంతారావు సంఘ నాయకుడిగా ఎదిగి ఉద్యోగులకు ఎంతో సేవ చేశారని చెప్పారు. పోస్టల్ సంఘంతో సొసైటీని, కాకతీయ సొసైటీని నిర్వహిస్తూ అందరి మన్ననలు అందుకోవడం గొప్ప విషయమన్నారు. కఠారి వాసుదేవనాయుడు, బ్రహ్మాచార్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం హైదరాబాద్ సిరిమువ్వ కల్చరల్ కళాకారులు ప్రదర్శించిన సాంఘిక నాటకం జేబు చెప్పిన ఊసులు ప్రేక్షకులను రంజింపజేసింది. స్నిగ్ధ రచించిన నాటకాన్ని మంజునాథ దర్శకత్వం వహించారు. డబ్బు ఉంది కదా అని ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెడితే అవసరానికి ఇబ్బందులు పడాల్సిన వైనాన్ని నాటకం కళ్లకు కట్టినట్లు చూపింది.

ఆకట్టుకున్న వివా విద్యార్థుల ఎక్స్‌పో



ఎక్స్‌పోను పరిశీలిస్తున్న వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వివా ది స్కూల్‌లో ఎడ్యుటెక్ ఇన్నోవేషన్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ ప్రాజెక్టు ఎక్స్‌పో కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటర్‌నెట్ ఆఫ్ థింక్స్, 3డీ ప్రింటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులు రూపొందించిన నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలతో 55 వినూత్న ప్రాజెక్టులను ఈ ఎక్స్‌పోలో ప్రదర్శించారు. ప్రాజెక్టులను రూపొందించిన విద్యార్థులను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో వివా ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, ఎడ్యుటెక్ ఇన్నోవేషన్ ప్రతినిధి కె.కళ్యాణ్, డైరెక్టర్ ఎలిటి కమాండర్ కేఎస్ రావు, సీబీఎస్ఈ సంధానకర్త జ్యోతి మెటిల్డా, వీవైపీ సంధానకర్త కే.మాధవి, తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికుల నిరసన

తెనాలి అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులను కాంట్రాక్టర్లకు కట్టబెట్టవద్దని కార్మికులను బానిసలుగా చేయవద్దని కోరుతూ మున్సిపల్ కార్మికులు పట్టణంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుండి గాంధీ చౌక్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.బాబుప్రసాద్ మాట్లాడుతూ, మునిసిపల్ శాఖ మంత్రి నారాయణకు కార్మికుల సమస్యలు పలుమార్లు విన్నవించామని, సమయం కావాలని చెప్పి ఏడాది కావస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కాంట్రాక్టు వ్యవస్థ కారణంగా నెలల తరబడి జీతాలు అందడం లేదని ప్రశ్నిస్తే పనిఇవ్వకుండా బెదిరిస్తున్నారని చెప్పారు. వెంటనే ప్రభుత్వం మున్సిపల్ కార్మిక వ్యవస్థపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో షేక్ హుస్సేన్‌వలి, వెంకటేశ్వర్లు, పద్మ, సుశీల, రాజ్యలక్ష్మి, రమణ పాల్గొన్నారు.

వ్యాపారులు ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి: రాంప్రసాద్

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యాపారులు ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని మునిసిపల్ రెవెన్యూ అధికారి ఎస్‌వీ రాంప్రసాద్ అన్నారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలోని ఆర్వో చాంబర్‌లో రాంప్రసాద్ మాట్లాడుతూ భావితరాలకు పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయించిన, వినియోగించిన పురపాలక సంఘం చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. మంగళవారం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత నెల 26న యడవూరు గ్రామానికి చెందిన మువ్వా సాంబశివరావు (67)ను కారు ఢీ కొనడంతో తలకు గాయమైంది. చికిత్స నిమిత్తం మంగళగిరిలోని ఎన్నారై వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

బస్సుడ్రైవర్‌పై దాడి

పొన్నూరు టౌన్, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి జరిగిన సంఘటనపై రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం పొన్నూరు ఆర్టీసీ డిపోకి చెందిన నల్లమోతు నాగేశ్వరరావు మంగళవారం పొన్నూరు నుంచి ఇంటూరు రోడ్డులో వస్తుండగా తమ కారును బస్సు ఓవర్‌టేక్ చేసిందని మునిపల్లె వద్ద మంగళగిరికి చెందిన యువకులు బస్సును అడ్డుకుని డైవర్ నాగేశ్వరరావుపై దాడి చేశారు. దీనిపై నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నింధితుల కోసం గాలిస్తున్నారు.

విజ్ఞాన్స్ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ప్లాంటేషన్



విద్యార్థులకు మొక్కలు అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాసబాబు తదితరులు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ ఫార్మసీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నారాకోడూరులోని సీఎంఎస్ చిల్డ్రన్ హోమ్‌లో ప్లాంటేషన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ.శ్రీనివాసబాబు మంగళవారం తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కళాశాలలోని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మొక్కల ప్లాంటేషన్ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.



